మనసులో మాట

KANCHARLA

# తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

ఆదివారం 31 మే 2026 పేజీ : 16


## రైతులకు వాతావరణ

# సూచనలు

తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

02

రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు.



## పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుక



- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పథకాలు
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

03

## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం



02

- సిబిఎస్ఇ మూల్యంకలనంలో లోపాలు దారుణం
- అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కెటిఆర్
- విద్యార్థులకు అండగా పోరాడుతామని ప్రకటన

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పకుంటా
- లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా
- రైతుల ముసుగులో లబ్దికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీష్ రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



"తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ది కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు."

## తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు



04

## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం

కేశవరావు కమిటీ తొలి భేటీ





## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు
## కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్న బాల్క

## బిఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

అందులో భాగంగానే బాల్క వ్యాఖ్యలు

మండిపడ్డ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



.. వివరాలు 2లో

## బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

అందుకే అరెస్ట్ చేసిన పోలీసులు

బల్క వెనక కెసిఆర్ కుట్ర దాగివుంది

మీడియాతో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

.. వివరాలు 3లో

# సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

**హైదరాబాద్,మే30(మనసులో మాట):** బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీస్‌లను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్లు చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

# బిఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

**హైదరాబాద్,మే30:(మనసులో మాట):** బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బలయ్యాడని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల కాలంలో బీఆర్ఎస్ నాయకులు వాడుతున్న భాష, చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు.



శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ శైలిపై, వారి అణచివేత ధోరణిపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. 'బాల్క సుమన్‌తో ఎవరు మాట్లాడించారో కూడా తెలియాలి. పట్టాలు కోయాలని, దాడులు చేయాలని పిలుపునివ్వడం పూర్తిగా బీఆర్ఎస్ సంస్కృతి. ఇది ముమ్మాటికీ కేసీఆర్ నైజం. ఆయనకు తెలిసిన రాజకీయ నీతి ఇదే. కేసీఆర్ తనకు తెలిసిన కుటిల రాజకీయాన్నే కొడుకు కేటీఆర్‌కు నేర్పించారు. కేటీఆర్ తనకు తెలిసిన ఆ నీతినే బాల్క సుమన్‌కు నూరిపోశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ తప్పులు చేసి, దాన్ని ప్రశ్నిస్తే జై తెలంగాణ అంటారు. ఫార్ములా రేస్ నిధుల దుర్వినియోగంపై విచారణకు వెళ్తూ కూడా కేటీఆర్ జై తెలంగాణ అంటారు. తప్పులు చేసి వాటిని గొప్పగా చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతలకే చెల్లింది. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగ సంఘాలు, చివరకు రైతులను కూడా రెచ్చగొట్టడమే ఏకైక ఎజెండాగా పెట్టుకున్న బీఆర్ఎస్ నాయకులు.. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారు. సుమన్‌తో మాట్లాడించింది ఎవరో పోలీస్ అధికారులు విచారణ చేయాలని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు ఆలోచనల నుండి బిఆర్ఎస్ నేతలు బయటకు రావాలన్నారు.

# పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

- సిబిఎస్ఇ మూల్యంకలనంలో లోపాలు దారుణం
- అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కెటిఆర్
- విద్యార్థులకు అండగా పోరాడుతామని ప్రకటన



**హైదరాబాద్,మే30 (మనసులో మాట):** దేశంలో నీట్ పరీక్షల అక్రమాలపై రేగిన వివాదం ఇంకా చల్లబడకముందే, భారతీయ విద్యా వ్యవస్థ ప్రతిష్టను మరింత మసకబారుస్తూ సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవలే విడుదలైన సీబీఎస్ఈ ఫలితాలలో డిజిటల్ మూల్యాంకనం లోపాల కారణంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ మార్కుల తారుమారు వ్యవహారం దేశవ్యాప్తంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. న్యాయం కోసం ఉధృతంగా పోరాడుతున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ.. దేశ భవిష్యత్తును ఇలాంటి కుళ్ళిన, అసమర్థ వ్యవస్థల మీద ఎంతమాత్రం నిర్మించలేమని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో తెలంగాణను కుదిపేసిన ఒక చేదు జ్ఞాపకం మళ్లీ తెరపైకి వచ్చిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలను అస్తవ్యస్తం చేసి, పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన 'గ్లోబరేనా' సంస్థే ఇప్పుడు కేవలం తన పేరును మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి అంతకంటే పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. కేంద్ర బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇంత పెద్ద గందరగోళం నెలకొందని విమర్శించారు. నాడు గ్లోబరేనా వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించిందని కేటీఆర్ గుర్తుచేశారు. లోపాలను వెలికితీసేందుకు తక్షణమే ముగ్గురు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తప్పు చేసిన సంబంధిత అధికారులను పదవుల నుంచి తక్షణమే తొలగించామని కేటీఆర్ వివరించారు. అంతేకాకుండా, బాధ్యురాలైన సదరు సంస్థపై కోర్టులో చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నామని ప్రస్తావించారు. ఇంతటి చెడ్డ పేరు ఉన్న ఒక అసమర్థ సంస్థను సీబీఎస్ఈ బోర్డు ఎలా నమ్మిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఆ సంస్థకు లబ్ది చేకూర్చేందుకే బోర్డు తన నిబంధనలను పదే పదే మార్చిందని ఆయన ఆరోపించారు. ఒక చిన్న పేరు మార్పు ప్రక్రియతో పాత తప్పులను దాచిపెట్టి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, తప్పుడు మూల్యాంకనాలతో దేశంలోని విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని, లక్షలాది మంది మానసిక క్షోభకు కారణమైన ఈ మార్కుల వివాదానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి కచ్చితంగా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. బాధితులైన విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రైతులకు వాతావరణ సూచనలు

## తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్,మే30(మనసులో మాట)::** రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

ఈ సందర్భంగా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.



# పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుక

- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పథకాలు
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,మే30 (మనసులో మాట):** పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ - గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ల ధర్నాకు బిఆర్ఎస్ మద్దతు

## వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్న కెటిఆర్



**హైదరాబాద్,మే30(ఆర్ఎన్ఎ)(మనసులో మాట):** హైదరాబాద్ నగరంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ.. కాంట్రాక్టర్ల సమస్యలు, హామీల అమలు తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..'కేసీఆర్ హయాంలో అధికారులకు స్వేచ్ఛనిచ్చి పని చేయమని చెప్పారు. ఒక్కో విద్యార్థి మీద ప్రత్యేక దృష్టి పెట్టి తొమ్మిదిన్నర ఏళ్ళు చదివించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చారు. రేవంత్.. పేమెంట్ కోటాలో సీఎం పదవి తెచ్చుకున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుడతారా అని సీఎం అంటున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుట్టరని తెలుసు.. 30నెలల్లో కూడా పిల్లలు పుట్టకుంటే ఏమంటారు? కాంట్రాక్టులన్నీ సీఎం బామ్మర్దికి, మంత్రి పొంగులేటి కొడుకుకు వస్తున్నాయి. ముఖం బాగాలేక అద్దం పగుల కొట్టినట్లు ఉంది పరిస్థితి . కేసీఆర్ అప్పుల పాలు చేశారు అంటున్నాడు. కేసీఆర్ అప్పు చేసి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారు. ఢిల్లీకి పోదాం.. జీవో నెంబర్ 17 రద్దు అయ్యేవరకు పోరాడుదాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. సెక్యూరిటీ లేకుండా రోడ్డు మీదకు రండి.. మీకు పరిస్థితి తెలుస్తుంది. మళ్ళీ 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది' అని కేటీఆర్ అన్నారు.

# బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం



**హైదరాబాద్,మే30 (మనసులో మాట):** బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి కారణం ఆయన మాటలేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్ లో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ... బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన మాటలే కారణం. సుమన్ వ్యాఖ్యల వెనక కేసీఆర్ కుట్ర ఉంది. మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి. సామాన్య ప్రజలు తిరిగే రైళ్లపై మీకు ఎందుకు అంత అక్కసు. రైళ్లలో తిరిగేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలే. మీకు ఓట్లేయలేదని పెదలపై కోపమా?. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేనూ నిరసన కార్యక్రమాలు చేశాను. మేం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేశాము' అని వెంకట్ అన్నారు.బీఆర్ఎస్ పార్టీ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. ఆయన మాటలకు కౌంటర్ గా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ స్పందించారు. కేసీఆర్ ఒకయానికి డ్రగ్ శాఖ ఇచ్చాడు. మరొకరికి పిచ్చోడిలా వాగే శాఖ ఇచ్చాడు. సుమన్‌కి రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చాడు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ పెట్టాలి' అంటూ బల్మూరి వెంకట్గ అన్నారు

## కాళేశ్వరంను పడావు పెట్టడం సరికాదు

**పెద్దపల్లి,మే30 (మనసులో మాట):** లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విమర్శించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే స్పష్టమైన నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం నీరు లేకపోవడం ఆందోళనకర విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన సాగునీటిని అందించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటానికి సిద్ధం కావాలి

**చల్లా ధర్మారెడ్డి**

**ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు**

**హన్మకొండలో సర్పంచులు, ఉపసర్పంచులతో మాజీ ఎమ్మెల్యే సమీక్ష**



**హన్మకొండ,(మనసులో మాట):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఈ ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటానికి కార్యకర్తలు సిద్ధం కావాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హన్మకొండలోని ఆయన నివాసంలో సంగెం, గీసుగొండ మండలాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి, నేడు ప్రజలకు సమాధానం చెప్పలేని దుస్థితిలో ఉందని మండిపడ్డారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయిందని, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు మళ్లీ గులాబీ పార్టీ వైపు ఆసక్తి చూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు: పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్.ఐ.ఆర్ (SIR) ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడటంలో బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. పంచాయతీల్లో అవినీతి: గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలనలో భారీగా అవినీతి, అవకతవకలు జరుగుతున్నాయని సర్పంచులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీటిని తీవ్రంగా పరిగణించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగెం, గీసుగొండ మండలాలకు చెందిన పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక గస్తీ

**అర్ధరాత్రి రంగంలోకి దిగిన ఎస్పీ డా. శబరీష్**

**మహబూబాబాద్,(మనసులో మాట):** జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నివారణకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఎస్పీ డా. శబరీష్ స్వయంగా అర్ధరాత్రి బైక్‌పై గస్తీ తిరుగుతూ అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. యువత గంజాయికి బానిస కాకుండా ప్రత్యేక యూరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పాజిటివ్ వచ్చిన వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో కౌన్సెలింగ్, చికిత్స అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. గంజాయిపై సమాచారం కోసం 8712656999 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

# తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

## ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు



**హైదరాబాద్,మే30(మనసులో మాట):** తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతోజూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించు కోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభావంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశించవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 2014-15లా సాధారణ వర్షపాతం 905.4 మి.మీ. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.మీ. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 5-6 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ ఏడాది రెండో వారంలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ఆరంభం ఉంటుందని చెప్పారు.

# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

- జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం
- కేశవరావు కమిటీ తొలి భేటీ



**హైదరాబాద్,మే30: (మనసులో మాట):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ ఛైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా
- లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీష్ రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మే30(మనసులో మాట):** తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈసవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ధి కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన ఢిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం,ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడంలేదని సీఎంరేవంత్ వ్యాఖ్యానించారు.

## ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు త్వరలో ప్రత్యేక టెట్

**పులగం దామోదర్ రెడ్డి**

**ఏడాదికి మూడుసార్లు టెట్ నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు**

**జగిత్యాల జిల్లా ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్ర అధ్యక్షుల వెల్లడి**



**జగిత్యాల,(మనసులో మాట):** రాష్ట్రంలో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ (TET) పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, దీనికి సంబంధించి ఎస్‌సీఈఆర్‌టీ (SCERT) అధికారుల ఆమోదం పొందిన ఫైల్ ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపినట్లు పిఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి ప్రకటించారు. శనివారం జగిత్యాలలోని పొన్నాల గార్డెన్స్‌లో పిఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతి ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇకపై టెట్ పరీక్షలను ఏడాదికి మూడుసార్లు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, త్వరలోనే దీనిపై స్పష్టమైన ఆదేశాలు వెలువడతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అపోహలకు గురికావద్దని, హెల్త్ కార్డుల ప్రక్రియను ట్రస్ట్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఇందులో ఉద్యోగ సంఘాలకు కూడా భాగస్వామ్యం ఉందని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం జనాభా లెక్కల ప్రక్రియ కొనసాగుతోందని, జూన్ 9వ తేదీ నాటికి ఇది పూర్తవుతుందని ఆయన తెలిపారు. అనంతరం జూలై నెలలో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందని వెల్లడించారు. ప్రభుత్వం వంద రోజుల్లో ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, పీఆర్సీ (ప్రా=జ) నివేదికను కూడా వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం, ప్రీ-ప్రైమరీ తరగతుల నిర్వహణను ఆయన అభినందించారు. పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లా రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిందని, అందుకు కారకులైన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్ మాట్లాడుతూ, విద్యాశాఖలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) రాము మాట్లాడుతూ, ఉపాధ్యాయుల కృషి, ప్రధానోపాధ్యాయుల నాయకత్వం వల్లనే జిల్లాకు ఈ ఘనత దక్కిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 178 మంది ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లను ఘనంగా సన్మానించారు. అలాగే, టాపర్ విద్యార్థులు 50 మందికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్నాథ్ రెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘం నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశాభివృద్ధి

**యువతుల మాక్ పార్లమెంట్ సదస్సులో పాల్గొన్న కలెక్టర్**

**విద్యపై దృష్టి సారించాలని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని బాలికలకు సూచన**



మనసులో మాట, మే 30, ఆదిలాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన యువతుల మాక్ పార్లమెంట్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిశోర బాలికలు బాల్య వివాహాలు, ఇతర ఆకర్షణలకు దూరంగా ఉండి, తమ లక్ష్యసాధన కోసం విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని హితవు పలికారు.

**విద్యార్థి దశలోనే పునాది:**

9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దశ అని కలెక్టర్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే క్రమంలో ఆన్‌లైన్ విద్యా వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేజీబీవీ (KGBV) పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు, విద్యార్థినులలో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. బాలికలు శాస్త్ర, సాంకేతిక రంగాల పట్ల మక్కువ పెంచుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సదస్సులో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. అనంతరం సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, మహిళా ప్రతినిధులను సన్మానించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, అందరూ చదువుతోనే అద్భుతాలు సృష్టించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**కలెక్టర్ ప్రతిమా సింగ్**

**పారిశ్రామిక పార్కుల ఏర్పాటుపై సమీక్ష**



**మెదక్,(మనసులో మాట):** జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మూడు డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రెవెన్యూ, టీజీఐఐసీ (TGIIC) అధికారులు సమన్వయంతో పనిచేసి, భూసేకరణలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీలు

- కొత్తగూడలో హెలిప్యాడ్, కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డులో సభా ప్రాంగణాల సందర్శన
- భద్రతా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎస్పీలు నితికా పంత్, అఖిల్ మహాజన్



**కొమురం భీం ఆసిఫాబాద్,(మనసులో మాట) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో చేపడుతున్న భద్రతా ఏర్పాట్లను ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం సంయుక్తంగా పరిశీలించారు. కెరమెరి మండలం కొరారి పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను సందర్శించి, భద్రతా ప్రమాణాల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల కోసం ఏర్పాటు చేస్తున్న ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను డ్రోన్ ద్వారా పర్యవేక్షించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్పీలు స్పష్టం చేశారు. కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, రెబ్బెన సీఐ సంజయ్, ఎస్ఐలు వెంకటకృష్ణ, సుబ్బారావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన సందర్భంగా జిల్లా సమస్యలపై దృష్టి సారించాలి

- సాగునీరు, ఉపాధి, వైద్యం, విద్యారంగాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం డిమాండ్
- సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి
- అసంపూర్తి ప్రాజెక్టుల వల్ల రైతుల ఇబ్బందులు, సాంకేతిక విద్యా సంస్థల కొరతపై ఆందోళన
- జిల్లాను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించాలని ప్రభుత్వానికి సీపీఎం జిల్లా కమిటీ విజ్ఞప్తి

**కొమురం భీం ఆసిఫాబాద్,(మనసులో మాట):** జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి సీపీఎం జిల్లా కమిటీ తరపున హృదయపూర్వక స్వాగతం పలుకుతూనే, జిల్లా అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ప్రకృతి సంపద, అడవులు, సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ జిల్లా అభివృద్ధిలో వెనుకబడి ఉండటం బాధాకరమని వారు పేర్కొన్నారు.

**ముఖ్య డిమాండ్లు:**

సాగునీరు: జిల్లాలో అనేక ప్రాజెక్టులు, కాలువల నిర్మాణాలు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్నాయి. ప్రాజెక్టులు నిర్మించినా కాలువలు పూర్తి చేయకపోవడం లేదా కాలువలు నిర్మించినా ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో వేలాది ఎకరాలు సాగుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ పనులను పూర్తి చేయాలి.

ఉపాధి: సిర్పూర్ పేపర్ మిల్లు స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమవుతోంది. స్థానిక నిరుద్యోగులు అర్హతలు కలిగి ఉన్నప్పటికీ, బయటి ప్రాంతాల వారికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల యువత వలస వెళ్తున్నారు. కాలుష్యాన్ని మాత్రం స్థానికులు భరిస్తూ, ఆర్థిక ప్రయోజనాలు బయటి వారికి దక్కడం దురదృష్టకరం. స్థానికులకు ప్రాధాన్యత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

వైద్యం, విద్య: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నిపుణుల కొరతతో ప్రజలు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. అలాగే జిల్లాలో



సాంకేతిక విద్యా సంస్థలైన ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. నాణ్యమైన సాంకేతిక కళాశాలలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి పర్యటన ఈ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని, జిల్లాను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించాలని సీపీఎం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

# భక్తిశ్రద్ధలతో వేణుగోపాలస్వామి ఆలయంలో స్నాపన తిరుమంజనం

- నమ్మాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ఘనంగా విశేష పూజా కార్యక్రమాలు

**చౌదేపల్లి,(మనసులో మాట ):** చౌదేపల్లిలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం శనివారం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. నమ్మాళ్వార్ తిరునక్షత్రం పురస్కరించుకుని, ఆలయంలో స్వామివారికి స్నాపన తిరుమంజనం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వశిష్టాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, తేనె, పంచామృతాలతో విశేష అభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో, ఆభరణాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ తిరుమంజన కార్యక్రమం భక్తులకు కన్నుల పండువగా సాగింది. నమ్మాళ్వార్ తిరునక్షత్ర వేడుకల్లో పాల్గొనేందుకు చౌదేపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం "గోవింద నామస్మరణ"తో మార్మోగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.



# దగ్ధమైన ఈత వనాల బాధితులకు నష్టపరిహారం అందించాలి

- జగిత్యాల జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- 18 వేలకు పైగా ఈత చెట్లు దగ్ధం; వందలాది గౌడ కుటుంబాల జీవనాధారం దెబ్బతిన్న వైనం
- తక్షణమే ప్రత్యేక సర్వే నిర్వహించి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి



**జగిత్యాల, (మనసులో మాట):** కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాల్లో భారీగా దగ్ధమైన ఈత వనాల సమస్యపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రమాదాల వల్ల తీవ్రంగా నష్టపోయిన గౌడ కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన కోరారు.

### జీవనాధారం కోల్పోయిన వందలాది కుటుంబాలు:

మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో తీవ్ర ఎండల కారణంగా జరిగిన అగ్నిప్రమాదాల్లో సుమారు 18,100 ఈత చెట్లు దగ్ధమయ్యాయని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల వందలాది గౌడ కుటుంబాలు తమ జీవనాధారాన్ని కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని వివరించారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల ద్వారా వెంటనే ప్రత్యేక సర్వే నిర్వహించి, నష్టపోయిన బాధితులకు తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### భవిష్యత్తులో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు:

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ఈత వనాలు అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేకంగా వాటర్ బోర్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నీటి సౌకర్యం అందుబాటులో ఉంటే, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో స్పందించి ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### సానుకూలంగా స్పందించిన కలెక్టర్:

ఎమ్మెల్యే వినతిపై కలెక్టర్ సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందే సహాయాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గౌడ కుటుంబాలకు అండగా ఉంటామని, బాధితులకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు.

# సరస్వతి పుష్కర ముగింపు వేళ.. అధికారులారా అప్రమత్తం

- చివరి రెండు రోజుల్లో భారీగా పెరగనున్న భక్తుల రద్దీ
- ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు.. నిరంతరం అందుబాటులో ఉండాలి: కలెక్టర్ రాహుల్ శర్మ







**కాళేశ్వరం,(మనసులో మాట):** సరస్వతి అంత్య పుష్కరాలు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, రానున్న రెండు రోజుల్లో భక్తుల రద్దీ భారీగా ఉండే అవకాశం ఉందని, ఈ మేరకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద పుష్కర ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు.

### ప్రత్యేక దృష్టి సారించాల్సిన అంశాలు:

పుష్కర ఘాట్ల వద్దకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా కింది అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు: పారిశుద్ధ్య & తాగునీరు: భక్తుల సంఖ్య పెరగనున్న నేపథ్యంలో ఘాట్ల వద్ద పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని, భక్తులకు నిరంతరాయంగా తాగునీటిని అందించాలని పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.

వైద్య సేవలు: ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు వడదెబ్బకు గురికాకుండా, అన్ని పుష్కర ఘాట్ల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, తగిన మందులను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖకు సూచించారు.

ట్రాఫిక్ నియంత్రణ: వాహనాల రాకపోకలు పెరిగే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రవాణా, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్ స్థలాల వద్ద సిబ్బందిని అదనంగా నియమించాలని తెలిపారు.

### నిరంతరం అందుబాటులో ఉండాలి:

ఎండల తీవ్రత దృష్ట్యా, భక్తులు తెల్లవారుజాము నుంచే త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూ కట్టే అవకాశం ఉందని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధుల్లో నిరంతరం అందుబాటులో ఉండాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా పుష్కర స్నానాలు, స్వామివారి దర్శనం పూర్తయ్యేలా చూడటమే యంత్రాంగం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# మొక్కజొన్న రైతులకు రూ.5.42 కోట్ల చెల్లింపులు

### జిల్లాలోని 460 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన మార్క్‌ఫెడ్



**భూపాలపల్లి,(మనసులో మాట):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొక్కజొన్న (మైజ్) పంటను సాగు చేసిన రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా చెల్లింపులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్నను విక్రయించిన 460 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.5.42 కోట్ల నగదును జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. రైతులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా, చెల్లింపులు సకాలంలో అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఒకవేళ కొనుగోలు ప్రక్రియలో గానీ, చెల్లింపుల విషయంలో గానీ ఏవైనా సమస్యలు ఎదురైతే రైతులు సంబంధిత కొనుగోలు కేంద్రాల అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం, వారికి ఆర్థిక భరోసా కల్పించడంలో జిల్లా యంత్రాంగం నిరంతరం కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# సింగూర్‌లో అత్యవసర పంపింగ్ పనులను వేగవంతం చేయాలి

### జూన్ 1 నుంచి పంపింగ్ ప్రారంభానికి జలమండలి ఎండీ ఆదేశం

**హైదరాబాద్,(మనసులో మాట):** నగర తాగునీటి అవసరాల దృష్ట్యా సింగూర్ రిజర్వాయర్‌లో చేపడుతున్న అత్యవసర పంపింగ్ పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సమీక్షించారు. సింగూర్‌లో ప్రస్తుతం 5.477 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా, జూన్ 1 నుంచి పాక్షికంగా పంపింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, ఎటువంటి అంతరాయం లేకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.



# పత్తి దిగుమతులపై కస్టమ్స్ సుంకాలు పూర్తిగా మినహాయింపు

**దేశీయ టెక్స్టైల్, వస్త్ర పరిశ్రమకు భారీ ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ,(మనసులో మాట):** దేశీయ వస్త్ర (టెక్స్టైల్) పరిశ్రమను అంతర్జాతీయ మార్కెట్‌లో బలోపేతం చేసేందుకు మరియు ముడిసరుకు కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. దేశంలో వస్త్ర పరిశ్రమకు అవసరమైన పత్తి లభ్యతను భారీగా పెంచేందుకు వీలుగా.. విదేశాల నుండి దిగుమతి చేసుకునే పత్తిపై విధించే అన్ని రకాల కస్టమ్స్ సుంకాలను (Import Duties) పూర్తిగా మినహాయిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాత్కాలిక సుంకాల మినహాయింపు నిబంధనలు రాబోయే 2026 జూన్ 1వ తేదీ నుండి అక్టోబర్ 30వ తేదీ వరకు అమలులోకి వస్తాయని కేంద్రం స్పష్టం చేసింది.

**ఉత్పత్తి వ్యయం తగ్గి.. పరిశ్రమకు ఊరట..**

కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో దేశంలోని టెక్స్టైల్, దుస్తుల తయారీ (గార్మెంట్స్) రంగాల్లో ముడిసరుకు కొరత తీరడమే కాకుండా, భారీగా పెరిగిన కొనుగోలు వ్యయం తగ్గి తయారీదారులకు పెద్ద ఎత్తున ఆర్థిక ఉపశమనం లభించనుంది. దీనివల్ల అంతిమంగా మార్కెట్‌లో దుస్తుల ధరలు తగ్గి సామాన్య వినియోగదారులకు కూడా గణనీయమైన ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఒకవైపు దేశీయ కాటన్ రైతుల ప్రయోజనాలను, మరోవైపు మిల్లుల అవసరాలను సంపూర్ణంగా సమతుల్యం చేస్తూ, కేవలం స్థానిక పత్తి మార్కెట్లోకి వచ్చే లోపు (లీన్ పీరియడ్‌లో) మాత్రమే ఈ తాత్కాలిక మినహాయింపును అమలు చేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది.

**ఎంఎస్ఎంఈ రంగానికి మరింత ఊతం..**

అంతర్జాతీయంగా పత్తి సరఫరా గొలుసులో మార్పులు వచ్చిన నేపథ్యంలో, ఈ దిగుమతులు సులభతరం కావడం వల్ల భారతీయ మార్కెట్లో పత్తి అందుబాటు మునుపటి కంటే చాలా మెరుగుపడుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వస్త్ర పరిశ్రమల (మీఎస్‌ఎంఈ) ఉత్పత్తి సామర్థ్యం, మిల్లుల నిర్వహణ వేగం పెరిగేందుకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. కేంద్రం తీసుకున్న ఈ వ్యూహాత్మక చర్య దేశీయ టెక్స్టైల్ పరిశ్రమ అంతర్జాతీయ ఎగుమతుల్లో పోటీ పడేలా చేస్తుందని, తద్వారా రాబోయే రోజుల్లో వస్త్ర ఉత్పత్తి రంగానికి మరియు ఉపాధి కల్పనకు మరింత ఊతమివ్వనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి అభివృద్ధి పనులపై చర్చ**

**ఖమ్మం,మనసులో మాట:** ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ను సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ శనివారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాల అమలు, తీరుపై చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటిని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

# మోటార్ సైకిళ్లకు వైద్యం.. రోగులకు తీవ్ర ఇబ్బందులు

- గజ్వేల్ జిల్లా ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద అస్తవ్యస్తంగా ద్విచక్ర వాహనాల పార్కింగ్
- అత్యవసర అంబులెన్స్‌ల రాకపోకలకూ తప్పని తిప్పలు వృద్ధులు, గర్భిణీల అవస్థలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని ఆసుపత్రి అధికారులు ప్రత్యేక పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్




**మనసులో మాట, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి (ఏరియా హాస్పిటల్) ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద మోటార్ సైకిళ్లను ఇష్టారాజ్యంగా, అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండటంతో చికిత్స నిమిత్తం వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. నిత్యం వందలాది మంది పేద రోగులకు వైద్య సేవలు అందించాల్సిన ఈ ప్రాంగణం.. ప్రస్తుతం ఎలాంటి నిఘా, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ ద్విచక్ర వాహనాల అక్రమ పార్కింగ్ స్థలంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రి ప్రధాన ప్రవేశ ద్వారం (మెయిన్ గేట్) ఎదుటే వాహనాలను అడ్డంగా నిలిపివేయడంతో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే బాధితులు లోపలికి వెళ్లేందుకు, వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై రోగులను తరలించేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సుదూర గ్రామాలనుంచి వచ్చే వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులతో వచ్చే తల్లులు ఈ మోటార్ సైకిళ్ల రద్దీ మధ్య నుంచి నడవలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర ప్రాణ రక్షణ సేవల కోసం సైరన్ వేసుకుంటూ వచ్చే 108 అంబులెన్స్‌లకు సైతం ఈ అస్తవ్యస్త పార్కింగ్ వల్ల లోపలికి రావడానికి కొన్నిసార్లు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆసుపత్రి ముందరి దుకాణదారులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నీడ ప్రాంతాలన్నీ వాహనాలే ఆక్రమణ..**

ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువుల వాహనాలతో పాటు, బయటి మార్కెట్ ప్రాంతానికి వచ్చే ఇతర వ్యక్తులు కూడా ఉచిత పార్కింగ్ స్థలమంటూ తమ మోటార్ సైకిళ్లను తెచ్చి ఇక్కడే పార్కింగ్ చేయడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. ఆసుపత్రి ఆవరణలో రోగులు, వారి సహాయకులు ఎండ తీవ్రతకు తలదాచుకునేందుకు ఉన్న నీడ ప్రాంతాలను (చెట్ల కింద) సైతం ఈ ద్విచక్ర వాహనాలే ఆక్రమించాయి. దీంతో రోగులు ఎండలోనే నిల్చోవాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. ఈ ప్రైవేట్ వాహనాల పార్కింగ్ సమస్యపై గతంలో పలుమార్లు రోగులు ఆసుపత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ.. వారు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రి ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో ఒక ప్రత్యేక పార్కింగ్ జోన్‌ను గుర్తించి, బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రధాన ద్వారం వద్ద నో-పార్కింగ్ జోన్‌గా ప్రకటించి సెక్యూరిటీ సిబ్బందిని కాపలా ఉంచాలని రోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య అధికారులు తక్షణమే స్పందించి, రోగుల సౌకర్యార్థం పార్కింగ్ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చట్టాలపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- సోషల్ మీడియాను విద్యాభివృద్ధి, నైపుణ్యాల పెంపుదల కొరకే సానుకూలంగా ఉపయోగించాలి
- విద్యార్థినులు నిర్భయంగా ప్రశ్నించే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి
- కలెక్టరేట్‌లో 'స్నేహ' కార్యక్రమం; 33 శాతం రిజర్వేషన్లతో రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపు




**మనసులో మాట, జగిత్యాల టౌన్:** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా 'స్నేహ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సుకు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. యువత, ముఖ్యంగా బాలికలు తమ హక్కులు, చట్టాలు మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మహిళల భద్రత, గౌరవం, సమాన అవకాశాల కోసం ప్రభుత్వం అనేక చట్టాలు, రక్షణ పథకాలను అమలు చేస్తోందని, వాటిని తెలుసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

**సోషల్ మీడియాను విద్యాభివృద్ధికి వాడాలి..**

ప్రస్తుత ఆధునిక సమాజంలో సోషల్ మీడియా ప్రభావం విపరీతంగా ఉన్న నేపథ్యంలో యువత, విద్యార్థినులు తమ విద్యాభివృద్ధి, నైపుణ్యాల పెంపుదల మరియు వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే అసత్య ప్రచారాలు, తప్పుడు సమాచారానికి (ఫేక్ న్యూస్) యువత పూర్తిగా దూరంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సానుకూల దృక్పథంతో ఉపాధి అవకాశాల కోసం వినియోగించాలని తెలిపారు. విద్యార్థినులు క్లాస్ రూమ్ నుండి సమాజం వరకు నిర్భయంగా ప్రశ్నించే అలవాటును అలవర్చుకోవాలని, ప్రశ్నించడం ద్వారానే సరికొత్త జ్ఞానం పెరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సొంతంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని చిన్నతనం నుంచే అభివృద్ధి చేసుకోవాలన్నారు.

**రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి..**

సమాజంలో ఇంకా వేరూనుకుని ఉన్న బాల్య వివాహాలు, లింగ వివక్ష, సరికొత్తగా వేధిస్తున్న సైబర్ నేరాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై ప్రతి విద్యార్థిని అప్రమత్తంగా ఉండాలన్నారు. చట్టసభల్లో ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న నేపథ్యంలో యువ బాలికలు గ్రామ స్థాయి నుండి కేంద్ర స్థాయి రాజకీయాల వరకు దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు మాట్లాడే తీరును, చట్టాల తయారీని నిశితంగా గమనించాలని సూచించారు. సమాజ ప్రగతిలో మహిళల పాత్ర కీలకమని, ప్రతీ బాలిక ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్య, ఉపాధి, సేవా రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ ఉన్నత స్థాయి అవగాహన కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (DRDO) అధికారి రఘువరన్, మెప్మా అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలు కాల్చొద్దు.. భూసారాన్ని కాపాడండి

- కొయ్యలను తగలబెడితే భూమిలో మేలు చేసే సూక్ష్మజీవులు నశించి, దిగుబడులు క్షీణిస్తాయి
- పిడిచెడ్ గ్రామంలో రైతులకు వరి అవశేషాల యాజమాన్యంపై క్షేత్రస్థాయిలో ముమ్మర అవగాహన
- దుక్కిలో ఎస్ఎస్‌పీ వాడితే కొయ్యలు త్వరగా కుళ్లుతాయి
- డీఏపీ ఖర్చు సగం తగ్గుతుందని వెల్లడి



**మనసులో మాట, గజ్వేల్:** యాసంగి వరి కోతలు పూర్తయి తదుపరి సాగుకు భూములను సిద్ధం చేస్తున్న తరుణంలో రైతులు సాంప్రదాయ పద్ధతుల్లో వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గడంతో పాటు పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందని గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బాబు నాయక్ తెలిపారు. శనివారం గజ్వేల్ మండలంలోని పిడిచెడ్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలు, వాటిని భూమిలోనే కలిపి దున్నడం ద్వారా పొందే దీర్ఘకాలిక ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ బాబు నాయక్ మాట్లాడుతూ.. వరి కొయ్యలను పొలాల్లోనే వేసి తగలబెట్టడం వల్ల ఉత్పన్నమయ్యే విపరీతమైన అధిక వేడి కారణంగా భూమి పైపొరల్లో ఉండి పంటలకు రక్షణగా నిలిచే, రైతులకు మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు మరియు వివిధ రకాల సూక్ష్మజీవులు పూర్తిగా నశిస్తాయని హెచ్చరించారు. దీనివల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతిని భూసారం క్రమంగా తగ్గిపోయి రాబోయే రోజుల్లో పంటల దిగుబడులు ఘోరంగా క్షీణించే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా కొయ్యలను కాల్చడం వల్ల దట్టమైన పొగ కమ్మేసి వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, పంటలకు సహజసిద్ధంగా అందాల్సిన నత్రజని, పొటాష్ వంటి ముఖ్యమైన పోషకాలు గాల్లో కలిసిపోతాయని వివరించారు.

### సేంద్రియ కర్బనం పెంచే మార్గాలు..

రైతులు ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ వరి కొయ్యలను భూమిలోనే కలిపి రోటవేటర్ ద్వారా దున్నడం వల్ల నేలలో సేంద్రియ కర్బన (ఆర్గానిక్ కార్బన్) శాతం పెరిగి భూమి అత్యంత సారవంతంగా మారుతుందని ఏడీఏ రైతులకు సూచించారు. దుక్కి దున్నే సమయంలో ఎకరాకు సరిపడా సింగిల్ సూపర్ ఫాస్పేట్ (ఎస్ఎస్‌పీ) ఎరువును చల్లడం ద్వారా వరి అవశేషాలు, గడ్డి చాలా వేగంగా కుళ్లిపోయి మొక్కలకు అవసరమైన పోషకాలుగా రూపాంతరం చెందుతాయన్నారు. ఈ పద్ధతిని పాటిస్తే తదుపరి పంటలో ఖరీదైన డీఏపీ (డాప్) ఎరువు వినియోగాన్ని సగం వరకు తగ్గించుకుని పెట్టుబడి ఖర్చు ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా వరి వ్యర్థాలను భూమిలో కలపడం వల్ల నేల గుల్లబారి తేమను, నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని, తద్వారా మొక్కల వేర్లు బలంగా పాతుకుని పంటల ఎదుగుదల, దిగుబడులు అద్భుతంగా మెరుగుపడతాయని రైతులకు వివరించారు. ఈ క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) గణేష్, గ్రామ రైతులు పవన్, స్థానిక రైతు ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో అన్నదాతలు పాల్గొన్నారు.

# "పొగాకు వద్దు ఆరోగ్యం ముద్దు" పొగాకు రహిత సమాజమే మన లక్ష్యం!

- నారాయణపేటలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ న్యాయ విజ్ఞాన సదస్సు; జడ్జి అవినాష్ పిలుపు
- సిగరెట్, గుట్కాలతో ప్రాణాంతక క్యాన్సర్లు; ప్యాసివ్ స్మోకర్లకు సైతం సమానమైన ముప్పు
- ఉచిత న్యాయ సహాయం కోసం '15100' నెంబర్‌ను సంప్రదించాలి: లీగల్ ఎయిడ్ కౌన్సెల్ లక్ష్మీపతి గౌడ్




**నారాయణపేట(మనసులోమాట):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ (RDO) కార్యాలయ ప్రాంగణంలో గల డీఎం,హెచ్ఓ (ఐవీ&ఎన్) ఆఫీస్‌లో శనివారం 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' (మే 31) పురస్కరించుకుని ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ (DLSA), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, జిల్లా జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ అధ్యక్షతన ఈ అవగాహన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి అవినాష్ మాట్లాడుతూ.. పొగాకు మహమ్మారి వల్ల కలిగే ప్రాణాంతక అనారోగ్య సమస్యల గురించి ప్రజల్లో ముందస్తు అవగాహన కల్పించడమే ఈ అంతర్జాతీయ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పొగాకు వాడకం అనేది కేవలం ఒక వ్యక్తి శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలను కూడా ఆర్థికంగా, మానసికంగా పూర్తిగా చిన్నాభిన్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో ఎంతోమంది యువకులు చిన్న వయస్సులోనే ఈ వ్యసనాలకు బానిసపడి ప్రాణాలు కోల్పోతున్నారని, మన ఆరోగ్యం, మన కుటుంబాల భద్రత కోసం ప్రతి ఒక్కరు పొగాకుకు దూరంగా ఉండాలని గట్టిగా నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు.

### ఏ రూపంలో తీసుకున్నా ప్రాణాంతకమే..

పొగాకును ఏ రూపంలో తీసుకున్నా – సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, జర్దా లేదా నమిలే పొగాకు – అది కచ్చితంగా ప్రాణాలకు హానికరమేనని జడ్జి స్పష్టం చేశారు. పొగాకులో ఉండే 'నికోటిన్' అనే అత్యంత ప్రమాదకరమైన విష పదార్థం మనిషిని చాలా త్వరగా వ్యసనపరుడిగా (అడిక్ట్) మారుస్తుందన్నారు. దీనివల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, నోరు మరియు గొంతు క్యాన్సర్, గుండెపోటు (హార్ట్ ఎటాక్), పక్షవాతం వంటి తీవ్రమైన వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. అంతేకాకుండా, ధూమపానం (స్మోకింగ్) చేసేవారికే కాకుండా, ఆ ప్రమాదకరమైన పొగను పీల్చే చుట్టుపక్కల ఉండే అమాయక ప్రజలకు, కుటుంబ సభ్యులకు (Passive smokers) కూడా సమానమైన ఆరోగ్య ముప్పు పొంచి ఉందన్నారు.

### బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి..

ఈ సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలో ఇంకా కొనసాగుతున్న బాల్య వివాహాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని, బాలకార్మిక వ్యవస్థను మూలాల నుండి రూపుమాపాలని పిలుపునిచ్చారు. చట్టాలపై పేదలు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా నిరుపేదలు ఎవరైనా సరే టోల్ ఫ్రీ నెంబర్ '15100' కి కాల్ చేసి ఉచితంగా చట్టపరమైన న్యాయ సహాయాన్ని, సలహాలను పొందవచ్చని వెల్లడించారు. ఈ జిల్లా స్థాయి న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎం&హెచ్ఓ) డాక్టర్ జయచంద్ర మోహన్, డిప్యూటీ డీఎంఓ డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ జాం రాజు, ఏఎస్ఐ ఆంజనేయులు, సీనియర్ న్యాయవాది రఘువీర్, పారా లీగల్ వాలంటీర్లు, పెద్ద సంఖ్యలో ఆశా (ఆశా) కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థిని భవితకు అండగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

స్కూల్ ఫీజు రూ. 60 వేలు చెల్లింపు.. తక్షణ అవసరాల కోసం అదనంగా రూ. 20 వేల ఆర్థిక సాయం



**హైదరాబాద్,(మనసులో మాట) :** రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకుంటూ మానవతా హృదయంతో స్పందించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన భవిత అనే ప్రతిభావంతురాలైన విద్యార్థిని, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాత ఫీజు బకాయిలు చెల్లించలేక, పాఠశాల నుండి తన ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విషయం సోషల్ మీడియా వేదికగా మంత్రి దృష్టికి వచ్చింది. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే స్పందించి, ఆ విద్యార్థిని పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం సదరు పాఠశాల ప్రిన్సిపల్‌తో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫీజు వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం విద్యార్థిని భవితను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లోని తన మినిస్టర్స్ క్వార్టర్స్ నివాసానికి పిలిపించుకుని, ఆమె విద్యాభ్యాసం, భవిష్యత్తు లక్ష్యాలు మరియు కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించి ఎంతో ఆప్యాయంగా ఆరా తీశారు.

### సర్టిఫికెట్లు ఇప్పించి.. పైచదువులకు భరోసా..

ఇటీవల జరిగిన పాలిసెట్ పరీక్షల్లో సైతం భవిత రాష్ట్ర స్థాయిలో 634వ అత్యుత్తమ ర్యాంకు సాధించి, ఉన్నత చదువులు చదవాలనే బలమైన ఆకాంక్షను మంత్రి వద్ద వ్యక్తం చేసింది. దాంతో మంత్రి కోమటిరెడ్డి తక్షణమే స్పందించి, ఆమె చదివిన స్కూల్‌కు బకాయి ఉన్న రూ. 60 వేల ఫీజు మొత్తాన్ని స్వయంగా చెల్లించి, ఆమెకు రావాల్సిన సర్టిఫికెట్లను సగర్వంగా అందజేశారు. దీనితో పాటు ఆమె తదుపరి కాలేజీ అడ్మిషన్లు, ఇతర తక్షణ అవసరాల నిమిత్తం అదనంగా రూ. 20 వేల నగదు ఆర్థిక సహాయాన్ని చేతికి అందించారు. భవిష్యత్తులో భవిత ఉన్నత చదువులకు పూర్తి బాధ్యత వహిస్తానని, అవసరమైతే ల్యాప్‌టాప్ సహా ఇతర సాంకేతిక సాయాల కోసం ఎప్పుడైనా తనను నేరుగా సంప్రదించవచ్చని కొండంత అండగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించడం, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం సమాజంలో ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని, మానవత్వంతో చేసే సేవే నిజమైన దైవత్వమని పేర్కొన్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో తమ పెద్ద సమస్య చిటికెలో పరిష్కారమైందని, తమకు దేవుడిలా అండగా నిలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన ఈ మహోపకారాన్ని జీవితాంతం మర్చిపోలేమని విద్యార్థిని భవిత, ఆమె తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పట్టణ పేదలకు సీఎం రేవంత్ రెడ్డి కానుకగా ఇందిరమ్మ ఇళ్లు

**ప్రతి నియోజకవర్గమే యూనిట్‌గా నివసించే ప్రాంతాల్లోనే నిర్మాణం; మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**



**హైదరాబాద్,(మనసులో మాట):** పట్టణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల పరిధిలోనే అన్ని వసతులతో కూడిన అధునాతన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో రూపుదిద్దుకోనున్న 'ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయం' (సమీకృత భవనం) నిర్మాణానికి శనివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పట్టణ పేదల సొంతింటి కలను నైజం ప్రకారం నిజం చేసేందుకు తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ నిర్మాణాలను కేవలం ఏడాది కాల పరిమితిలోనే పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ఆ తర్వాత మలి విడతలో మరో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. గత ప్రభుత్వంలా పేద ప్రజలను వారుండే ప్రాంతాలకు 30 నుండి 40 కిలోమీటర్ల దూరంలో తీసుకెళ్లి పడేయకుండా, ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అదే పరిధిలో ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాని గుమ్మం వద్దకే చేరాలన్నదే తమ లక్ష్యమన్నారు.

### కార్పొరేట్ తరహాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు..

స్టాంపులు, రిజిస్ట్రేషన్, సర్వే తదితర కీలక శాఖల సేవలను ప్రజలకు ఒకే చోట, సులభంగా అందించేందుకే ఈ సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి వివరించారు. మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. బంజారాహిల్స్‌లో ఫీనిక్స్ సంస్థ సామాజిక బాధ్యత (CSR) కింద 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అద్భుత భవనాన్ని నిర్మిస్తోందని తెలిపారు. ఈ నూతన భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులతో పాటు డీఐజీ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్-గోల్కొండ ఆఫీసులు ఏర్పాటు కానున్నాయి. అలాగే ఈ ఆవరణలో స్థానిక ముస్లిం సోదరులు ఏటా రెండుసార్లు పవిత్ర నమాజ్ నిర్వహించుకునేందుకు వీలుగా తగిన స్థలాన్ని కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ ఉన్నత స్థాయి శంకుస్థాపన కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా, సికింద్రాబాద్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు మరియు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో పోలీసుల మెగా స్పెషల్ డ్రైవ్





- గంజాయి, భారీగా మద్యం సీజ్
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశాలతో రంగంలోకి దిగిన డీఎస్పీ అంజయ్య, పోలీస్ బలగాలు
- ఇందిరానగర్‌లో ఇల్లాళ్ల ఇళ్లపై దాడులు; 55 బీర్లు, 43 క్వాటర్ల రికవరీ.. పాత నేరస్థుడు అరెస్ట్
- తప్పిపోయిన పెద్దేముల్ బాలుడిని రక్షించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఖాకీలు

**వికారాబాద్ (మనసులోమాట):** వికారాబాద్ జిల్లా కేంద్రంలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన మరియు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ (IPS) గారి కఠిన ఆదేశాల మేరకు శనివారం వికారాబాద్ డీఎస్పీ అంజయ్య స్వయంగా రంగంలోకి దిగి పట్టణ వ్యాప్తంగా భారీ ప్రత్యేక తనిఖీలు (ౄజూవఝఖుౖ ఐతీఅజవ) నిర్వహించారు. ఈ మెరుపు దాడుల్లో గంజాయి ముఠాలు, అక్రమ మద్యం బెల్ట్ షాపు నిర్వాహకులకు పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు.

### గంజాయి స్వాధీనం.. ఇందిరానగర్‌లో మద్యం పట్టివేత..

ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుండి సుమారు 2 గ్రాముల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదేవిధంగా, పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో కొందరు యువకులు ఒక ఇంటి ముందు గుమిగూడి బహిరంగంగా మద్యం సేవిస్తుండగా బ్లూకోల్ట్స్ సిబ్బంది గమనించారు. వెంటనే సదరు ఇల్లాన్ని, పరిసరాలను క్షుణ్ణంగా సోదా చేయగా అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయించడానికి నిల్వ ఉంచిన 55 బీర్ బాటిళ్లు, 43 క్వాటర్ల మద్యం సీసాలను పోలీసులు గుర్తించి, వాటిని తక్షణమే సీజ్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పలు లాడ్జిలను, హోటళ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దొంగతనం కేసుల్లో ఉన్న ఒక పాత నేరస్థుడిని పాపిలోన్ డివిజన్ బృందంతో కలిసి రైల్వే స్టేషన్ వద్ద గుర్తించి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.

### బాలుడిని కాపాడిన డీఎస్పీ అంజయ్య..

ఈ తనిఖీల క్రమంలో రైల్వే స్టేషన్ పరిసరాల్లో భయపడుతూ, అనుమానాస్పదంగా తిరుగుతున్న 15 సంవత్సరాల ఒక మైనర్ బాలుడిని పోలీసులు గుర్తించారు. డీఎస్పీ అంజయ్య సమక్షంలో ఆ బాలుడిని ప్రేమగా విచారించగా.. అతని పేరు శ్రీకాంత్ అని, పెద్దేముల్ మండలం రుక్మాపూర్ నివాసి అని తెలిసింది. ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడి ఎవరికీ చెప్పకుండా పారిపోయి వచ్చినట్లు బాలుడు ఒప్పుకున్నాడు. డీఎస్పీ అంజయ్య తక్షణమే మానవత్వంతో స్పందించి బాలుడి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్‌కు రప్పించి బాలుడిని సురక్షితంగా వారి చెంతకు అప్పగించారు. కుమారుడిని చూసుకున్న తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ వికారాబాద్ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పట్టుబడిన నిందితులందరిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, వికారాబాద్‌లో గంజాయి, అక్రమ మద్యం అమ్మితే చట్టప్రకారం పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అంజయ్య స్పష్టం చేశారు. ఈ మెగా డ్రైవ్‌లో వికారాబాద్ ఎస్‌హెచ్‌ఓ (SHO) రఘు కుమార్, క్విక్ రెస్పాన్స్ టీమ్ (QRT) బృందం, వికారాబాద్ క్రైమ్ టీమ్, బ్లూకోల్ట్స్ (BC) సిబ్బంది మరియు స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- జూన్ 1న కొరారి కొత్తగూడకు ముఖ్యమంత్రి, మంత్రుల రాక; అదనపు కలెక్టర్లతో కలిసి ఏర్పాట్ల పరిశీలన
- సీఎం చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం; గ్రామస్తులతో సహ పంక్తి భోజనం, ముఖాముఖి
- హెలిప్యాడ్, సభాప్రాంగణం వద్ద నిరంతర విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య పనులపై అధికారులకు ఆదేశాలు

**ఆసిఫాబాద్, (మనసులోమాట):** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా చేపట్టాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. రాబోయే జూన్ 1వ తేదీన జిల్లాలోని కెరమెరి మండలం కొరారి కొత్తగూడ గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు మరియు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి (ఆర్డీఓ) లోకేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావులతో కలిసి కలెక్టర్ పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానున్న అధునాతన ఇందిరమ్మ ఇళ్లను ఆమె నిశితంగా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ.. సీఎం ప్రారంభించబోయే ఇందిరమ్మ ఇళ్లను సాంప్రదాయ పద్ధతిలో చక్కగా అలంకరించాలని సూచించారు. ముఖ్యమంత్రి గారు స్వయంగా గ్రామస్తులతో కలిసి సహ పంక్తి భోజనం చేయనున్నారని, అలాగే లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి (ఆత్మీయ సమ్మేళనం) కార్యక్రమం ఉన్నందున సమావేశ వేదిక వద్ద పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నిర్మించే స్థలం నుండి గ్రామంలోకి వచ్చే ప్రధాన రహదారి పొడవునా ఆకర్షణీయమైన స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యటన ముగిసేవరకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, తాగునీటికి ఎలాంటి



ఇబ్బందులు లేకుండా వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేయాలని, పారిశుద్ధ్య (క్లీనింగ్) పనులు ఎప్పటికప్పుడు ముమ్మరంగా చేపట్టాలని స్పష్టం చేశారు. మన జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి, మంత్రులకు ఘనంగా, చిరస్మరణీయంగా స్వాగతం పలికేలా ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ ఉన్నత స్థాయి క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో కెరమెరి తహసీల్దార్, ఎంపీడీఓ, గృహనిర్మాణ శాఖ ఈఈ, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో రిటైర్డ్ సిబ్బంది అందించిన సేవలు అభినందనీయం

- ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్
- ధన్వాడ ఏఎస్సై సమద్, నర్వ హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయుల పదవీ విరమణ; ఎస్పీ కార్యాలయంలో ఘన సన్మానం
- శేష జీవితం కుటుంబ సభ్యులతో హాయిగా గడపాలి; రిటైర్డ్ ఉద్యోగులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అందజేయాలని కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఎస్పీ కఠిన ఆదేశాలు



**నారాయణపేట(మనసులో మాట):** పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలందించి, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు ఎంతో అభినందనీయమని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ (IPS) కొనియాడారు. ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై)గా విధులు నిర్వర్తించి నేడు పదవీ విరమణ పొందిన ఎం.ఏ. సమద్, అలాగే నర్వ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా (హెచ్‌సీ) విధులు నిర్వర్తించి శనివారం పదవీ విరమణ పొందుతున్న కె. ఆంజనేయులుల వీడ్కోలు సమావేశం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో (ఎస్పీ ఆఫీస్) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు అందజేశారు.

**శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర..**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ నిర్వహణలో ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ అనేది ఒక తప్పనిసరి మరియు సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. కానిస్టేబుల్ (పీసీ) స్థాయి నుంచి అంకితభావంతో పనిచేస్తూ, నేడు ఉన్నత స్థాయిలలో రిటైర్ అవుతున్న 1984 బ్యాచ్‌కు చెందిన ఏఎస్సై ఎం.ఏ. సమద్, 1992 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కె. ఆంజనేయులుల సేవలను శాఖ ఎప్పటికీ మరువదన్నారు. ఉమ్మడి జిల్లా కాలం నుండి నారాయణపేట పరిధిలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల అదుపులో వారు పోషించిన పాత్రను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం వారి శేష జీవితం కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, ప్రశాంతంగా సాగాలని, వయస్సు రీత్యా ఆరోగ్యాన్ని ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

**ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందాలి..**

రిటైర్ అయిన సిబ్బందికి ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ నుండి రావలసిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను (రిటైర్మెంట్ బెనిఫిట్స్) ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణమే అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆఫీస్ సూపరింటెండెంట్‌ను ఆయన ఆదేశించారు. పదవీ విరమణ తర్వాత భవిష్యత్తులో కుటుంబానికి గానీ, వ్యక్తిగతంగా గానీ ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ పూర్తి అండగా ఉంటుందని, ఏ అవసరమున్నా నేరుగా తనను సంప్రదించవచ్చని అధికారులకు ఎస్పీ గట్టి భరోసా ఇచ్చారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో నారాయణపేట డీఎస్పీ మహేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు (సీఐ) శివశంకర్, రామ్ లాల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్సై) నరేష్, రమేష్, వెంకటేష్ గౌడ్, డీపీఓ సిబ్బంది, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిరుద్యోగ హామీలపై రాహుల్‌ను నిలదీయాలి

- 'యూత్ డిక్లరేషన్' పేరిట నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్; ముషీరాబాద్ బీఆర్ఎస్ సభలో ధ్వజం
- కొత్త ఉద్యోగాలు ఇవ్వకుండా గత ప్రభుత్వ నియామకాలనే తమ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శ

**హైదరాబాద్,(మనసులో మాట):** 'యూత్ డిక్లరేషన్' పేరిట తెలంగాణలోని నిరుద్యోగ యువతను కాంగ్రెస్ పార్టీ నమ్మించి ఘోరంగా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ హామీలపై రాష్ట్రానికి వస్తున్న రాహుల్ గాంధీని నిరుద్యోగ యువత నిలదీసి ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. ముషీరాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలనే పూర్తి చేసి, వాటిని తామే ఇచ్చామంటూ డబ్బా కొట్టుకుంటూ తమ ఘనతగా చెప్పుకుంటోందని విమర్శించారు. ఎన్నికల వేళ యువతకు అండగా ఉంటానని ప్రగల్భాలు పలికిన రాహుల్ గాంధీ, ఇప్పుడు ఇచ్చిన హామీల అమలుపై మొహం చాటేశారని దుయ్యబట్టారు.

**ఓటర్ల నమోదుపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి..**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై బీఆర్ఎస్ కార్యకర్తలు, బూత్ లెవెల్ అసిస్టెంట్లు (బీఎల్ఏ) అత్యంత అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఓటును కాపాడేలా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అధికార కాంగ్రెస్, బీజేపీలు డబుల్ ఓట్లు, దొంగ ఓట్లను అక్రమంగా నమోదు చేసే అవకాశముందని, అదే సమయంలో బీఆర్ఎస్ మద్దతుదారుల ఓట్లను జాబితా నుండి తొలగించే కుట్రలు జరుగుతున్నాయని, వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. హైదరాబాద్ నగర ప్రజలు ఎప్పుడూ బీఆర్ఎస్‌కు అండగా ఉన్నారని, నగర ఊహించని అభివృద్ధి తమ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫ్లైఓవర్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, సిగ్నల్ ఫ్రీ రోడ్లు నిర్మించిన బీఆర్ఎస్ మార్కు అభివృద్ధికి భిన్నంగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరిట కేవలం కూల్చివేతలకే పరిమితమైందని



ఆరోపించారు. వచ్చే నెల జూన్ నుంచి పార్టీ సభ్యత్వ నమోదును పూర్తిగా డిజిటల్ విధానంలో చేపడతామని, బూత్ స్థాయిలో కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# టీజేఎఫ్ రజతోత్సవ ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**మే 31న హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో వేడుకలు; అమరవీరుల స్థూపాల వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనకు పిలుపు**

**హైదరాబాద్,మనసులో మాట :** "తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు" అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ ముగింపు కార్యక్రమాన్ని మే 31వ తేదీ ఆదివారం నాడు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో అత్యంత ఘనంగా నిర్వహించాలని టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద, అలాగే అన్ని జిల్లాల కేంద్రాల్లోని అమరవీరుల స్థూపాల వద్ద జర్నలిస్టులంతా ఏకమై కొవ్వొత్తులు వెలిగించి అమరుల త్యాగాలను ఘనంగా స్మరించుకోవాలని ఆయన కోరారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు కలం పట్టిన జర్నలిస్టులు.. నేడు నూతన తెలంగాణ పునర్నిర్మాణంలో సైతం బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ మళ్లీ పునరంకితం అవుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.

**25 ఏళ్ల కలం యోధుల ప్రస్థానం..**

2001 మే 31వ తేదీన కేవలం పది మందితో ప్రత్యేక స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం కలం యోధులుగా ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం, నేటితో విజయవంతంగా 25 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని రజతోత్సవ వేడుకలకు చేరుకుందని అల్లం నారాయణ తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో వేలాది మంది జర్నలిస్టులను ఒకే వేదికపైకి తెచ్చి, ఉద్యమంలో టీజేఎఫ్ అత్యంత కీలకమైన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సరికొత్త భవిష్యత్తులో ఈ ఫోరం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ చారిత్రాత్మక రజతోత్సవ ముగింపు వేడుకల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అల్లం నారాయణ కోరారు.

# బాధితులను కాపాడితే రూ. 25 వేల బహుమతి కలెక్టర్

**'రహదారి వీరుల' పథకంపై కామారెడ్డిలో సమీక్ష**

**కామారెడ్డి,(మనసులో మాట):** రహదారి ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే 'రహదారి వీరుల' (రహవీర్) పథకాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులకు సహాయం చేయాలని, సకాలంలో ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం తరఫున రూ. 25 వేల నగదు బహుమతి అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన.. ఎస్పీ, రవాణా అధికారి, డీఎంహెచ్‌ఓ సభ్యులుగా 'డిస్ట్రిక్ట్ అప్రిసియేషన్ కమిటీ'ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రమాదాల నివారణకు ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



# విదేశీ విద్యకు చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్

**జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.ఏ. రషీద్!**

**జూన్ 1 నుండి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం; ఎంపికైన విద్యార్థులకు రూ. 20 లక్షల ఆర్థిక సాయం**

**నారాయణపేట,మనసులో మాట :**
అర్హులైన మైనారిటీ విద్యార్థుల విదేశీ ఉన్నత విద్య కోసం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 'చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్' పథకం (CMOSS) ఫాల్/స్ప్రింగ్ సీజన్-2026 కింద ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నారాయణపేట జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్ శనివారం ఒక ప్రెస్ నోట్‌లో తెలిపారు. విదేశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ), పీహెచ్‌డీ చదవాలనుకునే ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి గుర్తింపు పొందిన విదేశీ విశ్వవిద్యాలయాలలో ఈ ఏడాది జనవరి 1 నుండి జూన్ 30 లోపు ప్రవేశం పొంది, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత సాధించిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ (www.telanganaepass.cgg.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు జూన్ 30వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు గడువు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలను జూలై 31వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు నారాయణపేట కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

# 'ఆటా' తెలుగు మహాసభలకు రావాలని కేటీఆర్‌కు ఆహ్వానం

**జూలై 31 నుండి అమెరికాలోని మేరీల్యాండ్‌లో 19వ మహాసభలు; సానుకూలంగా స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**హైదరాబాద్ (మనసులో మాట):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రతినిధి బృందం శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ ఏడాది జూలై 31, ఆగస్టు 1, 2 తేదీల్లో అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ప్రతినిధులు ఆయనకు అధికారిక ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 'ఆటా' అధ్యక్షుడు జయంత్ చల్ల, ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల కలిసి.. మేరీల్యాండ్ మహాసభల సందర్భంగా నిర్వహించబోయే వివిధ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరంగా వివరించారు. అలాగే ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుల (ఎన్నారైల) పరిస్థితులు, తాజా అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, తెలుగు సమాజం సాధిస్తున్న ప్రగతిపై ఈ సమావేశంలో ఆసక్తికరమైన చర్చ జరిగింది. ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ మహాసభలకు హాజరయ్యేందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందించారని, ఇందుకు సంబంధించిన ప్రయాణ ప్రణాళికను త్వరలోనే ఖరారు చేయనున్నట్లు ఆటా ప్రతినిధులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆటా కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, ఈశ్వర్ రెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ మార్కుల గందరగోళంపై కేంద్రం సమాధానం చెప్పాలి

- 12వ తరగతి ఫలితాల అవకతవకలపై పోరాడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్తి మద్దతు
- నాడు తెలంగాణ ఇంటర్‌లో ముంచిన 'గ్లోబరెనా' సంస్థకే.. నేడు సీబీఎస్ఈ కీలక బాధ్యతలు అప్పగించడంపై ఆశ్చర్యం



**హైదరాబాద్,(మనసులో మాట):** సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదంపై న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తన పూర్తి మద్దతు ప్రకటించారు. మార్కుల కేటాయింపులో జరిగిన తీవ్ర అవకతవకలపై విద్యార్థులు, తల్లిదండ్రులు పారదర్శకత కోరే పూర్తి హక్కును కలిగి ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సీబీఎస్ఈ మార్కుల వివాదంలో ప్రధాన కేంద్రంగా నిలిచిన 'గ్లోబరెనా' సంస్థే, గత 2019లో తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల గందరగోళానికి కూడా కారణమైన సంస్థ అని గుర్తుచేశారు. అప్పట్లో తెలంగాణలో ఫలితాల తారుమారుతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురైనప్పుడు.. బీఆర్ఎస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ముగ్గురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, సదరు గ్లోబరెనా సంస్థపై న్యాయపరమైన కఠిన చర్యలు కూడా చేపట్టామని వివరించారు.

**లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో..**

అలాంటి నల్లని చరిత్ర (బ్లాక్‌లిస్ట్) ఉన్న సంస్థకు, కేంద్ర ప్రభుత్వం మళ్లీ సీబీఎస్ఈ లాంటి దేశంలోనే అత్యంత కీలకమైన విద్యా బోర్డు పరీక్షల బాధ్యతలను ఎలా అప్పగిస్తుందని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిబంధనలను సైతం తుంగలో తొక్కి, రూల్స్ సవరించి మరీ ఆ సంస్థకు అనుకూలంగా కేంద్ర పెద్దలు వ్యవహరించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల నేడు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఘోరంగా ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ తక్షణమే దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల నుండి వచ్చిన ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, జరిగిన తప్పిదాలను వెంటనే సరిదిద్దాలని కోరారు. ఈ గందరగోళానికి కారణమైన బోర్డు అధికారులపై, సదరు ప్రైవేట్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులకు పూర్తి న్యాయం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం కల్పించాల్సిన కనీస బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని కేటీఆర్ స్పష్టం చేశారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వినియోగించాలి

- కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ప్రజా అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా ఖర్చు చేయాలి
- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం; కలెక్టరేట్ సమీక్షలో ఆదేశం




**సంగారెడ్డి,(మనసులో మాట):** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజా అవసరాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా వినియోగించి, సామాజిక అభివృద్ధికి తోడ్పడే విధంగా పక్కా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమలు మరియు కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ నిధుల ప్రత్యేక సమీక్షా సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జిల్లాకు వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన సీఎస్ఆర్ నిధులు, వాటి వినియోగం మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నూతన ప్రతిపాదనలపై ఆయన క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) రంగాలకు సీఎస్ఆర్ నిధులను మొదటి ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వైద్య సంస్థలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను విస్తృతంగా వినియోగించాలన్నారు.



**పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన..**

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థినులకు ప్రత్యేక మరుగుదొడ్లు, పాఠశాలల చుట్టూ ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్లు, వసతి గృహాలు (హాస్టల్స్), అదనపు తరగతి గదుల నిర్మాణం, బెంచీలు-ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు మరియు పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలని మంత్రి పేర్కొన్నారు.

సీఎస్ఆర్ నిధుల ప్రతిపాదనల అమలు, గ్రౌండింగ్ మరియు పనుల పురోగతిపై జిల్లా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, అన్ని పనులను నిర్ణీత గడువులోగా సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. స్థానిక పరిశ్రమలు కేవలం లాభాపేక్షే కాకుండా సామాజిక అభివృద్ధిలో చురుకైన భాగస్వాములై, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ (సంగీత), పాండు, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు వివిధ పరిశ్రమలు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

- మహిళా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో కిశోర బాలికలతో 'మాక్ పార్లమెంట్' నిర్వహణ
- స్పీకర్, సీఎం, మంత్రులు, ప్రతిపక్ష పాత్రల్లో అద్భుతంగా రాణించి చట్టసభల తీరును ఆవిష్కరించిన బాలికలు





**నిజామాబాద్, (మనసులో మాట):** విద్యార్థి దశ నుంచే బాలికలు తమలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని నిజామాబాద్ జిల్లా పాలనాధికారి (కలెక్టర్) ఇలా త్రిపాఠి సూచించారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం కిశోర బాలికలతో 'మాక్ పార్లమెంట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ సభా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. చట్టసభలలో జరిగే సమావేశాల తీరును వారు కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరించారు. మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధి తదితర అంశాలపై ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన వారు ప్రశ్నలను లేవనెత్తగా.. మంత్రుల పాత్రను పోషించిన బాలికలు సమాధానాలు ఇస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. దాదాపు రెండు గంటలకు పైగా ఈ సెషన్ అద్యంతం ఆసక్తిగా కొనసాగింది. ప్రజాప్రతినిధుల పాత్రలో బాలికలు చక్కగా రాణించడం పట్ల కలెక్టర్ వారిని అభినందిస్తూ.. ప్రత్యేక బహుమతులు అందించి ప్రోత్సహించారు.

### స్మార్ట్ ఫోన్లలో సమయం వృధా చేయొద్దు..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సముచిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని హితవు పలికారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలని, స్మార్ట్ ఫోన్లలో అనవసర విషయాలకు సమయం వృధా చేయకూడదని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. భద్రతా పరమైన సమస్యలు ఎదురైనప్పుడు 'భరోసా' కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

### బాలికల పట్ల వివక్ష చూపొద్దు..

తల్లిదండ్రులు పిల్లలను సమదృష్టితో పెంచాలని, బాలికల పట్ల వివక్ష చూపకుండా వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే కేరళలో అక్షరాస్యత 90 శాతానికి పైగా ఉందని, అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ అక్షరాస్యతను వృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము గమనించిన పలు సమస్యల గురించి బాలికలు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరపున తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయన్న, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా సంక్షేమ అధికారిణి పద్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలి

- 'మహిళా వారోత్సవాల' సందర్భంగా వికారాబాద్ కలెక్టరేట్‌లో బాలల మాక్ పార్లమెంట్ హక్కుల సదస్సు
- స్పీకర్, మంత్రుల పాత్రల్లో అదరగొట్టిన స్నేహ సంఘాల బాలికలు; నూతన అక్షరాస్యులకు ప్రశంసా పత్రాల అందజేత



**వికారాబాద్,(మనసులో మాట):** జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా.. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకేపీ) ఆధ్వర్యంలో 'బాలల మాక్ పార్లమెంట్ – స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, దానికి విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విధానంపై అవగాహన కల్పించుకుని, సాంకేతికతను సరైన రీతిలో వినియోగించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని మహాత్మా గాంధీ సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### స్నేహ సంఘాలను బలోపేతం చేయాలి..

ప్రతి బాలిక గ్రామ పంచాయతీ స్థాయిలో 'స్నేహ సంఘాల'లో సభ్యులుగా చేరాలని, జిల్లాలో ఇప్పటివరకు 4500 మంది స్నేహ సంఘ సభ్యులుగా నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ సంఘాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని, దీనికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ మాక్ పార్లమెంట్‌లో విద్య, ఆరోగ్యం, హోం శాఖలపై బాలికలు సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులుగా స్నేహ సంఘాల సభ్యులు అద్భుతంగా పాత్రలు పోషించి రాణించారని కలెక్టర్ ప్రశంసించారు. అనంతరం జిల్లాలో నూతన అక్షరాస్యులుగా మారి చదువు నేర్చుకున్న అభ్యాసకులకు, వారికి చదువు నేర్పిన వాలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, అదనపు డీఆర్డీఏ నర్సింలు, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్ కుమార్, వయోజన విద్య జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ బాబు, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు జానకి, కార్యదర్శి శ్వేత, కోశాధికారి భాగ్యలక్ష్మి మరియు స్నేహ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి; సన్నాహక సమావేశంలో ఆదేశం**



**వికారాబాద్,(మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటాచారితో కలిసి, జూన్ 2న జరగబోయే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన ముందస్తు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీన కలెక్టరేట్ కార్యాలయ మైదానంలో నిర్వహించే ప్రధాన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ పరస్పర సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. సభాప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, ప్రముఖులకు, పురప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను సకాలంలో అందజేయాలని స్పష్టం చేశారు. ప్రోటోకాల్ నియమాలను కచ్చితంగా అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, సందర్శకులకు ప్రత్యేక సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సమగ్ర ప్రగతిపై రూపొందించే ప్రభుత్వ సందేశం కాపీలను సీపీఓ సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

### స్టాళ్ల ఏర్పాటు.. నిరంతర విద్యుత్ సరఫరా..

వేడుకల సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యతలను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మైదానంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం ముగిసేవరకు విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధిని ప్రతిబింబించేలా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, అల్పాహారం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు.. పోలీస్ బందోబస్తు, అమరవీరుల స్థూపం, ప్రధాన వేదిక అలంకరణలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సన్నాహక సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి వాసు చంద్ర, కలెక్టరేట్ ఏవో ఫర్హీన బేగం, డీఎస్పీ వీరేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉల్లాస్ వాలంటీర్లు అభ్యాసకులకు ఘన సన్మానం



**నిజామాబాద్, (మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఉల్లాస్ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన వాలంటీర్లు, అభ్యాసకులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ సాయన్న, డీడీ అడల్ట్ ఎడ్యుకేషన్ ఏ. పురుషోత్తం, అదనపు డీఆర్‌డీఓ మధుసూదన్, ఏపీఓ అరుంధతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నిరక్షరాస్యత నిర్మూలన, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా చైతన్యం పెంపొందించడంలో ఉల్లాస్ వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లు, అభ్యాసకులకు స్మారక చిహ్నాలు అందజేసి సన్మానించారు. విద్య వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ పురోగతికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

## న్యాయవాది కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

**హైదరాబాద్,(మనసులో మాట):** మాసాబ్ ట్యాంక్‌లో ఇటీవల దారుణ హత్యకు గురైన ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ నివాసాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం సందర్శించారు. మొయినుద్దీన్ అకాల మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడే న్యాయవాదిని ఇలా దారుణంగా హత్య చేయడం అత్యంత విచారకరమన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని, వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరామర్శలో ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోవాలి

### బాధితురాలు లక్ష్మి

**నిజామాబాద్,(మనసులో మాట):** తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన రేంగి లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు మంజూరైన నేపథ్యంలో ఇంటి నిర్మాణ పనుల ప్రారంభానికి సంబంధించిన పూజలు మాత్రమే నిర్వహించామని, గుప్తనిధుల కోసం ఎలాంటి పూజలు చేయలేదని స్పష్టం చేశారు. తమ భూమిని విక్రయించాలని కొందరు ఒత్తిడి చేశారని, అందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. అసత్య ప్రచారాల ద్వారా తన పరువుకు భంగం కలిగిస్తున్న వారిపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు

- గౌరవం కల్పించేందుకు పటిష్ట కార్యాచరణ
- జూన్ 4న అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం; కమిటీ తొలి భేటీలో కీలక నిర్ణయం
- విమర్శలకు తావు లేకుండా, ఉద్యమకారులందరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా సమాచార సేకరణ

**హైదరాబాద్, (మనసులో మాట):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియమించిన ఉన్నత స్థాయి కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమైంది. కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ తొలి సమావేశంలో.. కమిటీ విధివిధానాలు (టీఓఆర్), క్షేత్రస్థాయి నుంచి ఉద్యమకారుల సమాచార సేకరణ మరియు అర్హులైన వారి జాబితా తయారీ తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఒక అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి, వారి నుంచి విలువైన సూచనలు, సలహాలను స్వీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా పాల్గొని పోరాడిన వారందరినీ గుర్తించి, సముచితంగా గౌరవించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### జీఓ నెం. 679 ఉత్తర్వుల మేరకు తొలి



### సమావేశం..

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15న జి.ఓ.ఆర్.టి. నెం.679 జారీ చేసిన విషయం తెలిసిందేనని.. ఆ ఉత్తర్వుల తక్షణ అమలులో భాగంగానే ఈ కమిటీ తొలి సమావేశాన్ని నిర్వహించుకున్నామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి మరియు మలి దశల్లో క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొన్న వారి పూర్తి వివరాలను శాస్త్రీయంగా సేకరించి, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా అర్హుల జాబితాను తయారు చేయాలని కమిటీ అధికారులను ఆదేశించింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించిన వారు, పోలీసు కేసులు ఎదుర్కొన్న వారితో పాటు మేధావులు, కళాకారులు, రచయితలు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, విద్యార్థులు, ఆర్టీసీ మరియు సింగరేణి కార్మికులు తదితర అన్ని వర్గాల వారిని గుర్తించి గౌరవించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు తగిన గుర్తింపు మరియు న్యాయం కల్పించాలనే సంకల్పంతోనే ఈ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారని మంత్రి పేర్కొన్నారు. సమాచార సేకరణ ప్రక్రియలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా, పారదర్శకంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ సభ్యులు మరియు ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ (నర్సింహా రెడ్డి), న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత దూషణలు కోవర్టు రాజకీయాలు చేయొద్దు

- బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్‌కు టీడీపీ నేత మధుసూదన్ రాయల్ హితవు
- రాజనాల బండపై ప్రమాణానికి సవాల్; చట్టాలపై ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదం

**చౌడేపల్లి,(మనసులో మాట):** రాజకీయాల్లో ఉంటూ వ్యక్తిగత విమర్శలు చేయడం, కోవర్టు రాజకీయాలకు పాల్పడటం మానుకోవాలని పుంగనూరు పట్టణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్ రాయల్.. బీసీవై (భారత చైతన్య యువజన) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌కు సూచించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని చౌడేపల్లి మండలం రాజనాల బండ వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత వారం బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై అసభ్య పదజాలంతో మాట్లాడారని, దానికి తాను రాజకీయంగా కౌంటర్ ఇచ్చానని గుర్తుచేశారు. అయితే, దీనిపై పూల ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి తన పుట్టుకను ఉద్దేశిస్తూ దుర్భాషలాడటం వాస్తవమన్నారు. రామచంద్ర యాదవ్ నిజాయితీపరుడైతే, తానే స్వయంగా వచ్చి 'తాను వైసీపీ కోవర్టును కాదు' అని ఈ రాజనాల బండపై సత్య ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. పూల ప్రేమ్ కుమార్ గతంలో బీజేపీలో



ఉండి, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం బీసీవైలో చేరారని మధుసూదన్ రాయల్ విమర్శించారు. నిజాయితీగా రాజకీయం చేసేవారైతే పుంగనూరులోని షటిల్ కోర్టును ప్రేమ్ కుమార్, అతని కుటుంబ సభ్యులు ఆక్రమించుకోలేదా అని ప్రశ్నించారు. శనివారం తాను ప్రమాణ స్వీకారానికి వచ్చే సమయానికి అక్కడ బీసీవై పార్టీకి చెందిన వారెవరూ లేరని ఎద్దేవా చేశారు. ఆలయాల వద్ద ఇలాంటి దిగజారుడు రాజకీయం చేయడం తగదన్నారు.

### వైసీపీతో కోవర్టు రాజకీయాలు నిజం..

బీసీవై పార్టీ అధ్యక్షుడు రాష్ట్రమంతా తిరుగుతూ 'రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్' (ఉచిత విద్యా హక్కు చట్టం) గురించి మాట్లాడుతున్నారని, 2009 నుంచి ఈ చట్టం ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. వైసీపీతో కలిసి కోవర్టు రాజకీయం చేస్తున్నారనడానికి ఈ ఒక్క నిదర్శనం చాలన్నారు. పులివెందులలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై కేసు నమోదు చేయించామని బీసీవై నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారని, తీరా చూస్తే అక్కడ స్టేషన్ సీఐ నవ్వుతూ ఆయనను లోపలికి తీసుకెళ్లడం ప్రజలంతా చూశారన్నారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా రాష్ట్రానికి ప్రత్యామ్నాయం బీసీవై పార్టీ అంటే ఎవరు నమ్ముతారని, సొంత నియోజకవర్గమైన పుంగనూరులో మీ ఉనికి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. రాజకీయాల్లో కొనసాగాలంటే నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. అనంతరం కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- జూన్ 2 నాటికి పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి కలెక్టరేట్ మున్సిపల్ సమీక్ష



**అశ్వారావుపేట,(మనసులోమాట) :**అశ్వారావుపేట నియోజకవర్గ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు, తహసీల్దార్ కార్యాలయం మరియు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మొదటగా అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల నాణ్యత, పురోగతి మరియు భవనాల నమూనా మ్యాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భవిష్యత్తులో అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించేలా అన్ని రకాల అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాల ప్రాంగణానికి అనుసంధాన రహదారులు, అంతర్గత రోడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను' నిర్మిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి విద్యను అందించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే అద్భుత లక్ష్యంతో ఈ విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ..

అనంతరం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి, సాదా బైనామా, భూ సర్వేలకు సంబంధించిన దరఖాస్తులు మరియు వాటి పరిష్కార పురోగతిని తహసీల్దార్ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన రెవెన్యూ దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించి సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అలాగే మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకుని, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు..

ఆ తర్వాత అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. అశ్వారావుపేట మండలంలో మొత్తం 957 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 926 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని.. వీటిలో 123 ఇండ్లు బేస్ లెవల్‌లో, 189 ఇండ్లు రూఫ్ లెవల్‌లో, 403 ఇండ్లలో స్లాబ్ పనులు పూర్తికాగా, 200 ఇండ్ల నిర్మాణాలు పూర్తిగా పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో 136 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 129 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమై, 52 ఇండ్లు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పూర్తయిన మరియు చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జూన్ 2వ తేదీనాటికి గృహప్రవేశాలకు పక్కాగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాని ఇండ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కిషోర్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ మదన్ కుమార్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- లేబర్, హమాలీల సంఖ్యను పెంచాలని అడిషనల్ కలెక్టర్ నాగేష్ ఆదేశం



**మెదక్,(మనసులో మాట):** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాలు మరియు గోదాములలో లేబర్, హమాలీల సంఖ్యను తక్షణమే పెంచాలని మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నాగేష్ అధికారులను ఆదేశించారు. శనివారం చిలిపిచేడ్ మండలంలోని గౌతపూర్ గ్రామ శివారులో ఉన్న 'దక్కన్ ఆగ్రో రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' గోదాములను ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలు మరియు అన్‌లోడింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసి, మొలకెత్తిన ధాన్యం విషయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా నర్సాపూర్‌లోని రెండు ప్రత్యేక గోదాములకు తరలించి పంపిస్తామని వెల్లడించారు. మిగతా సాధారణ ధాన్యం బస్తాలన్నింటినీ ఈ దక్కన్ ఆగ్రో గోదాముల్లోనే పూర్తిగా ఖాళీ చేయించి భద్రపరుస్తామని స్పష్టం చేశారు. గోదాముల వద్ద ధాన్యం లోడుతో వేచి ఉన్న లారీలు, ట్రాక్టర్ల నుండి ధాన్యాన్ని త్వరితగతిన దించుకునేందుకు వీలుగా అదనపు లేబర్‌ను ఏర్పాటు చేయాలని ఇన్చార్జ్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎక్కడా ధాన్యం రవాణాకు, అన్‌లోడింగ్‌కు ఆలస్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ తహసీల్దార్ జహీర్, స్థానిక రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రాధాన్యత

**మంత్రి దామోదర రాజనర్సింహ**

**ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల బలోపేతానికి సమగ్ర చర్యలు చేపట్టాలి**



**సంగారెడ్డి,(మనసులో మాట):** రాష్ట్రంలో విద్యా రంగ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మైనర్, మేజర్ మరమ్మత్తులు త్వరితగతిన చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే సంక్షేమ వసతి గృహాల (హాస్టల్స్) పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు పటిష్ట భద్రత, పరిశుభ్రత కల్పించాలని ఆదేశించారు. బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం ప్రారంభానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాధికారిని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ బీఆర్ఎస్‌లపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,(మనసులో మాట):** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అబద్ధాల పునాదులపై తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవాలని చూస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలను ఉద్దేశించి మాట్లాడిన సీఎం, రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఒక్క గింజ ధాన్యాన్ని కూడా నేరుగా కొనుగోలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. వరి, జొన్న, మొక్కజొన్న సహా పలు పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని, రాష్ట్రం సేకరించిన మొత్తం ధాన్య నిల్వలను కేంద్రం వెంటనే స్వీకరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. అవసరమైతే అన్నదాతల కోసం రైతులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. జల వివాదాల విషయంలో రాష్ట్రాలు పరస్పర సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచిస్తున్నారని గుర్తుచేసిన సీఎం, తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై చర్చించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరినా వారి నుండి స్పందన రాలేదని తెలిపారు. కేంద్రం అడ్డంకులు సృష్టించినా రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని వేదికలపై తమ పోరాటం కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**జూన్ 2 వేడుకల ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ హేమావతి సమీక్ష**

**సిద్దిపేట,(మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 2న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ప్రధాన కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేడుకల మొత్తం కార్యక్రమ ఏర్పాట్లను సిద్దిపేట ఆర్డీవో పర్యవేక్షిస్తారని చెప్పారు. సభాప్రాంగణ వేదిక అలంకరణ, మైదానాన్ని ముస్తాబు చేయడం వంటి పనులు తెలంగాణ ఆవిర్భావ వేడుకల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఉండాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, వ్యవసాయం, ఉద్యానవనం, పౌరసరఫరాలు, సోలార్ పవర్, జనగణన-2027, ప్రత్యేక ఓటరు నమోదు తదితర ప్రభుత్వ శాఖలు మైదానంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్య అతిథి ప్రసంగ ప్రతులను (స్పీచ్ కాపీలను) ముందుగానే సిద్ధం చేయాలని, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు మరియు విఐపి, ప్రజల సీటింగ్ వంటి ఏర్పాట్లు పక్కాగా సమకూర్చాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మైదానంలో అవసరమైన ఓఆర్ఎస్, మందులతో కూడిన వైద్య సిబ్బందిని, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మైదానాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమానికి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అతిథులకు ముందస్తుగా ఆహ్వాన పత్రికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, డీఆర్వో నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్ మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కంటి వైద్య శిబిరంలో పరీక్ష చేయించుకున్న కలెక్టర్

**వికారాబాద్,(మనసులో మాట):** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సందర్శించారు. శిబిరంలో రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించిన అనంతరం, కలెక్టర్ స్వయంగా కంటి పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, మధుమేహం ఉన్నవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇలాంటి ఉచిత శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శిబిరంలో బాధితులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పవిత్ర, కలెక్టరేట్ ఏవో పర్వీన బేగం, వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి అనుచిత భాషలో మాట్లాడుతున్నారు
- ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి నిప్పులు



**హైదరాబాద్,మనసులో మాట :** ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను వంచించడం కాంగ్రెస్ పార్టీ నైజమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. శనివారం కాశిష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో మహిళలకు నెలకు రూ. 2,500 జీవన భృతి, ఏడాదిలోనే లక్ష ఉద్యోగాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని నమ్మబలికి ఓట్లు దండుకుందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు ఆరు గ్యారెంటీలు, ఇచ్చిన 420 హామీలు క్షేత్రస్థాయిలో అమలుకాలేదని తలసాని ఆరోపించారు. ఈ ప్రజా సమస్యలపై, హామీల అమలుపై తాము గట్టిగా ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి ఏమాత్రం సంస్కారం లేకుండా అనుచిత భాషలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలే తగిన విధంగా ప్రశ్నించే రోజులు అత్యంత దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

**కేసీఆర్ పదేళ్ల పాలన తెలంగాణకు స్వర్ణయుగం..**

కేసీఆర్ పదేళ్ల పాలన తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఒక స్వర్ణయుగమని తలసాని శ్రీనివాస్ యాదవ్ అభివర్ణించారు. గతంలో కేవలం రూ. 200 ఉన్న వృద్ధాప్య పింఛన్‌ను రూ. 2,000కు పెంచి అవ్వాతాతలను ఆదుకున్న ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దేనని చెప్పారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో, మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ విశ్వనగరం అన్ని రంగాలలో విస్తృతంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు అయినా నిర్మించిందా అని సవాల్ విసిరారు. నగర ప్రజలకు కనీసం తాగునీరు కూడా సక్రమంగా అందించలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో ఎన్నడూ తాగునీరు, విద్యుత్ సమస్యలు రాలేదని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఈ ప్రభుత్వానికి అస్సలు చిత్తశుద్ధి లేదని, పేరుకు ప్రజాపాలన అని చెప్పుకుంటూ, వాస్తవానికి దోపిడీ పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అరాచక పాలనపై ప్రజలు ఇప్పటికే తీవ్రంగా విసిగిపోయారని, రాష్ట్రంలో మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలమూరు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తాం

- రూ.32.05 కోట్లతో దేవరకద్ర నియోజకవర్గంలో అజిలాపూర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- వచ్చే రెండున్నరేళ్లలో ప్రధాన ప్రాజెక్టులన్నీ పూర్తి; ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రులు





**మహబూబ్‌నగర్,(మనసులో మాట):** ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేసి పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అజిలాపూర్ వద్ద రూ.32.05 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అజిలాపూర్ ఎత్తిపోతల పథకానికి మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా అజిలాపూర్, గద్దెగూడెం, వెంకటాయపల్లి గ్రామాల్లోని 1,400 ఎకరాల ఆయకట్టుకు కోయిల్‌సాగర్ ద్వారా సాగునీరు అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా తదితర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. జూన్ 4, 5 తేదీల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, నార్లాపూర్, ఉద్దండాపూర్ రిజర్వాయర్లను పరిశీలించి, పనులకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని, వచ్చే రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కోరిన చౌదరిపల్లి ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్ కాలువల మరమ్మతుల ప్రతిపాదనలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎస్పీ డి. జానకి తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన..**

అజిలాపూర్ శివారులో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి సందర్శించారు. కొనుగోళ్ల పరిస్థితి, కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చెల్లింపులపై రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతోందని, మద్దతు ధర డబ్బులు నేరుగా తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని రైతులు మంత్రులకు వివరించారు.

# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ప్రచురణ : హైదరాబాద్ - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 270 - ఆదివారం - 31 మే 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ







## ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి



దేశంలో నకిలీ నోట్ల అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం.

4

## ఉగ్ర కుట్ర భగ్నం

- ఢిల్లీ, ముంబై, పంజాబ్‌లలో భారీ దాడులకు కుట్ర
- ఐఎస్ఐ, దావూద్ లింకులతో 9 మంది అరెస్ట్
- ఉన్నత విద్యావంతులే సూత్రధారులు!



4

## ఆపరేషన్ సిందూర్ 2.0కు సర్వంసిద్ధం

పాక్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక



4

# మోటార్లకు మీటర్లు పెడితే పోటీ చేయం

### ఉచిత విద్యుత్ ఆపితే రాజకీయాల నుంచే తప్పుకుంటా

### లేకుంటే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా

- రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- ధాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు పోస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్



తెలంగాణలో వ్యవసాయానికి అందిస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిలిపివేసినా, లేదా పొరపాటున వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టినా తాము భవిష్యత్ ఎన్నికల్లో అస్సలు పోటీ చేయబోమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంచలన సవాల్ విసిరారు. ఒకవేళ తాము ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా కొనసాగిస్తే.. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్ (ఇష్టాగోష్టి)లో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ కేవలం తన రాజకీయ ఉనికి కోసమే రైతుల ముసుగులో సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు.

- హైదరాబాద్, మే 30 (మనసులో మాట)




# అధికారంలోకి వస్తాం

### రాగానే 111జీవో ఎత్తివేస్తాం!

- తెలంగాణ రక్షణ సేనతోనే రాష్ట్ర హక్కుల రక్షణ
- ఎలాంటి గ్యారంటీ లేకుండా యువతకు రూ.2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు
- గుంపు మేస్త్రీపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపు
- మొయినాబాద్ లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

మొయినాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 111 జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ ప్రజల ఆశయాలు పూర్తిగా నెరవేరలేదని కవిత అన్నారు. తెలంగాణ హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ఏర్పాటైందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా తమ పార్టీ ముందుకు వస్తోందని పేర్కొన్నారు.

2



# గంటన్నరలోనే రాష్ట్ర వేడుకలు!

- ఎండల తీవ్రతతో వేళల్లో మార్పు
- ఉదయానికే ముగింపు.. వేళల్లో మార్పులు
- 8.30కే ఆరంభం.. 10 గంటలకల్లా పూర్తి
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా ఆవిర్భావ ఉత్సవాలు
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కొత్త షెడ్యూల్

2

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈసారి అధికారిక వేడుకలను ఉదయం వేళల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించింది.



# సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

- కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్న బాల్క

2

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ



- 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యంగా రుతుపవనాలు..
- ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో లోటు వర్షపాతం ఉండే అవకాశం: వాతావరణ శాఖ అంచనా
- నీటిని పొదుపుగా వాడుకుంటూ, పంటల ప్రణాళికలు మార్చుకోవాలని నిపుణుల సూచన

2

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ మిన్నంటుతోంది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావం వల్ల ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానుందని, జూన్ నుంచి అక్టోబర్ వరకు సాగే ఈ వానాకాలం సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవచ్చని వాతావరణ కేంద్రం వెల్లడించింది.



# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

### జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం

### కేశవరావు కమిటీ తొలి భేటీ

రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ కార్యాచరణ ప్రారంభించింది. సచివాలయంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన శనివారం తొలి సమావేశం జరిగింది.

2



# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

**జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం**

**కేశవరావు కమిటీ తొలి భేటీ**

**హైదరాబాద్, మే 30:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ ఛైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## హైడ్రా మరో భారీ అపరేషన్

**పుప్పాలగూడ పరిధిలో ముష్కిన్ చెరువుకు విముక్తి**

**హైదరాబాద్, మే 30:** హైడ్రా మరో భారీ అపరేషన్ చేపట్టింది. కబ్జాకు గురైన చెరువును పరిరక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-నార్సింగి గ్రామాల పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ముష్కిన్ చెరువు అభివృద్ధి పేరుతో చేస్తున్న కబ్జాలకు చెక్ పెట్టింది. చెరువులో.. రూ.5,500 కోట్ల విలువైన కబ్జాలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం చెరువు 52.20 ఎకరాల పరిధిలో ఉండగా.. చెరువు మధ్యలోంచి కట్ట నిర్మించి 34.21 ఎకరాలు కబ్జా చేసే ప్రయత్నం జరిగిందని హైడ్రా పేర్కొంది. సీఎస్ఆర్ నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ.. అభివృద్ధి మాటున కబ్జాకు ప్రయత్నించింది. గ్రామ రికార్డుల ప్రకారం చెరువు పరిధి 59.11 ఎకరాలు కాగా.. ఇందులో ప్రభుత్వ శిఖం 20.23 ఎకరాలు, మిగతా అంతా పట్టాభూమి. అక్కడ ఎలాంటి నిర్మాణపనులు చేపట్టరాదనే నిబంధల్ని ఉల్లంఘించిన రియల్టర్లు.. పేదల పేరుతో గుడిసెలు వేసి కొట్టేయాలని ప్రయత్నించారు. ఖాళీ చేయాలని రెండు నెలల సమయం ఇచ్చిన హైడ్రా.. హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేస్తోంది. చెరువు మధ్యలో వేసిన కట్టను తొలగించింది.

## ఫిర్యాదుదారులకు అందుబాటులో పోలీసులు

**పనితీరు మెరుగు పర్చుకుని సాగాలి**

**టెక్నికల్ సేవల కోసం డిజిపి టెక్ టీమ్ ఏర్పాటు**

**పోలీస్ అధికారులతో డిజిపి ఆనంద్ సమీక్ష**

**హైదరాబాద్,మే30:** ఫిర్యాదుదారుల కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీజీపీ ఆనంద్ సూచించారు. సీసీటీఎన్ఎస్ వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్స్పెక్టర్ల నుంచి ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన డీజీపీ, పాత పద్ధతులను విడిచిపెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని డీజీపీ తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని సూచించారు. త్వరలో ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, ఫుడ్ అడల్టేషన్ వింగ్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. జూనియర్లు సీనియర్లకు గౌరవం ఇవ్వాలని, పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. టెక్నికల్ సేవల కోసం ప్రత్యేకంగా డీజీపీ టెక్ టీమ్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనర్లు క్రైమ్ రివ్యూ తప్పకుండా నిర్వహించాలని, యూనిట్ హెడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని డీజీపీ ఆనంద్ ఆదేశించారు.

# మోటార్లకు మీటర్లు పెడితే పోటీ చేయం

- ఉచిత విద్యుత్ ఆపితే రాజకీయాల నుంచే తప్పుకుంటా
- లేకుంటే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- ధాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు పోస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్



**హైదరాబాద్, మే 30 :** తెలంగాణలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసినా, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అదే విధంగా తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా అని మాజీ సీఎం కేసీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై స్పందించారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా విద్యుత్ పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని సమర్థంగా నిర్వహించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ చెప్పలేదని సీఎం పేర్కొన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పదేపదే లేవనెత్తుతోందని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, ప్రభుత్వం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తుంటే, గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న రూ.95 వేల కోట్ల అప్పులను తీర్చాల్సి వస్తోందన్నారు. తాము ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల్లోనే అప్పులు తీసుకుంటున్నామని వివరించారు.

**ధాన్యం కొనుగోలుపై కేంద్రంపై మండిపాటు**

ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మద్దతు ధర ప్రకటించడం తప్ప ఒక్క గింజ కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించిందని, తడిచిన ధాన్యానికీ మద్దతు ధర చెల్లిస్తున్నామని తెలిపారు. సన్న వడ్లకు బోనస్ కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో బీజేపీ ఎంపీలు, నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేకపోతే వారి ఇళ్ల ముందే ట్రాక్టర్లతో వడ్లు పోస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం రాష్ట్ర ధాన్యంలో కేవలం 32 శాతం మాత్రమే కొనుగోలు చేస్తోందని ఆరోపించారు.

**హరీశ్‌రావుపై ఆసక్తికర వ్యాఖ్యలు**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తుపై కూడా సీఎం వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదని అన్నారు. గతంలో ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి వద్దకు వెళ్లారని, ప్రస్తుతం కూడా ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసని వ్యాఖ్యానించారు. ఇటీవల పార్టీ సమావేశాన్ని వదిలి ఢిల్లీకి ఎందుకు వెళ్లారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ భవిష్యత్తులో కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. ఇదులకుంట చెరువు అక్రమాలపై హరీశ్‌రావు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

**తెలంగాణపై వివాదాస్పద వ్యాఖ్యలకు చెక్**

ఎన్టీఆర్ విగ్రహం, తెలంగాణ అంశాలపై ఇటీవల చెలరేగిన వివాదాలపై స్పందించిన సీఎం, ప్రాంతీయ లేదా కులపరమైన వివాదాలు సృష్టించడం బుద్ధిలేనితనమని అన్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ గడ్డపైనే పుట్టిందని, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలకు తాను దూరమని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో తనది విజయవంతమైన రాజకీయ కాంబినేషన్ అని సీఎం పేర్కొన్నారు. తమ నాయకత్వంలో పార్టీ వరుస విజయాలు సాధించిందని, భవిష్యత్తులోనూ అదే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహేశ్ గౌడ్‌కు కీలక పదవి దక్కే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఇప్పుడే ఆత్రుత అవసరం లేదని, తన దృష్టి మొత్తం రాష్ట్ర అభివృద్ధిపైనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# గంటన్నరలోనే రాష్ట్ర వేడుకలు!

- ఎండల తీవ్రతతో వేళల్లో మార్పు
- ఉదయానికే ముగింపు.. వేళల్లో మార్పులు
- 8.30కే ఆరంభం.. 10 గంటలకల్లా కార్యక్రమాల పూర్తి
- పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కొత్త షెడ్యూల్



**హైదరాబాద్, మే 30:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈసారి అధికారిక వేడుకలను ఉదయం వేళల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ ఉత్సవాలను గంటన్నర వ్యవధిలో ముగించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాన కార్యక్రమం ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానుంది. జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందనం, ప్రభుత్వ సందేశం, సాంస్కృతిక కార్యక్రమాలు సహా అన్ని అధికారిక కార్యక్రమాలను ఉదయం 10 గంటల కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదవుతున్న నేపథ్యంలో వేడుకలకు హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎండల బారిన పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఉదయం తర్వాత ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో కార్యక్రమాలను ముందుగానే నిర్వహించనున్నారు. వేడుకలకు వచ్చే ప్రజల కోసం తాగునీరు, మజ్జిగ, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, నీడ సదుపాయాలు, అత్యవసర చికిత్స ఏర్పాట్లు కల్పించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కూడా చేపట్టనున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడమే కాకుండా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎండల తీవ్రత మధ్య నిర్వహించే ఈ వేడుకల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

**కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు**

**ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటా: బాల్క**


**హైదరాబాద్, మే 30:** బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది.



ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీస్‌లను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్లు చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

- 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యంగా రుతుపవనాలు..



**అమరావతి/హైదరాబాద్, మే 30:** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గడం లేదు. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో పలుచోట్ల 45 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో తీవ్ర ఎండలు నమోదవగా, మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ 1 నుంచి అక్టోబర్ వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఎల్‌నినో ప్రభావమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాల కొరత ఉండే అవకాశం ఉన్నట్లు హెచ్చరిస్తున్నారు. అయితే తెలంగాణలో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలాల పునరుద్ధరణకు ఉపయోగపడతాయని పేర్కొంది. వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ ఏడాది వానాకాలం 2018 పరిస్థితులను తలపించే అవకాశం ఉంది. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు కురిసినా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాల తీవ్రత తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. గత ఐదు నుంచి ఆరు సంవత్సరాలతో పోలిస్తే ఈసారి రుతుపవన వర్షాలు తక్కువగా ఉండొచ్చని చెబుతున్నారు. దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు కనిపించే అవకాశం ఉండగా, మధ్య తెలంగాణలో మాత్రం ఆశాజనక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు జూన్ రెండో వారంలో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, రైతులు పంటల ప్రణాళికలను వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎండలు, ఆలస్యమవుతున్న రుతుపవనాలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

# అధికారంలోకి వస్తాం.. 111జీవో ఎత్తివేస్తాం!

- తెలంగాణ రక్షణ సేనతోనే రాష్ట్ర హక్కుల పరిరక్షణ
- ఎలాంటి గ్యారంటీ లేకుండా యువతకు రూ.20 కోట్ల వరకు రుణాలు
- గుంపు మేస్త్రీపై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి
- టీఆర్ఎస్ చీఫ్ కవిత పిలుపు
- మొయినాబాద్ లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



**మొయినాబాద్:** తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే 111 జీవోను పూర్తిగా ఎత్తివేస్తామని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మొయినాబాద్ మండల కేంద్రంలో పర్యటించిన ఆమె, అక్కడ ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా టీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కవిత మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే బాగా వచ్చు అని చెప్పుకున్న ఆ గుంపు మేస్త్రీ, చివరకు ఇక్కడున్న ఆ ఒక్క వ్యాపారాన్ని కూడా పూర్తిగా ఊడగొట్టాడు" అని ఘాటుగా విమర్శించారు. ఈ గుంపు మేస్త్రీ అరాచకాలపై తిరగబడటానికి, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

### జీవో 111 ఎత్తివేతతోనే రైతులకు మేలు:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే అన్ని సమస్యలు సమసిపోతాయని ప్రజలు ఆశించారని, కానీ నేటికీ ఆ ఆకాంక్షలు నెరవేరలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాధించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి, ఇక్కడి ప్రజల హక్కులను కాపాడటానికే 'తెలంగాణ రక్షణ సేన' ఒక కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చిందని ఆమె పేర్కొన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఎకరం భూమి ధర వంద కోట్ల రూపాయలు పలుకుతోందని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలోని 120 గ్రామాలకు గుదిబండగా మారిన 111 జీవోను ఎత్తివేస్తేనే స్థానిక రైతులకు నిజమైన మేలు జరుగుతుందన్నారు. "ఇంట్లో పిల్లల పెళ్లిళ్ల కోసమో, అవసరాల కోసమో ఒక పావు ఎకరం భూమి అమ్ముకున్నా రైతులకు మంచి ధర వచ్చే పరిస్థితి ఉంటుంది. ఎన్నికల ముందు అన్ని పార్టీలు ఈ జీవో ఎత్తివేస్తామని చెబుతాయి కానీ, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. మా పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది.. 111 జీవోను రద్దు చేస్తుందని నేను మీకు హామీ ఇస్తున్నా" అని ప్రకటించారు.

### ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలి

చేవెళ్ల, మొయినాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ మంది రైతులు, రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడిన వ్యాపారులే ఉన్నారని, ఈ ప్రభుత్వం వల్ల వారంతా నష్టపోతున్నారని కవిత ఆరోపించారు. అందుకే ఈ పాలకులపై తిరుగుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తమ పార్టీ సిద్ధాంతాలను నమ్మి పెద్ద ఎత్తున మైనార్టీ సోదరులు పార్టీలో చేరుతున్నారని, వారి చేరికతో పార్టీ మరింత బలోపేతమైందని హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడున్న గంగా-జమునా తెహజీబ్ సంస్కృతిని, మత సామరస్యాన్ని చెడగొట్టాలని చూసే శక్తులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

### యువతకు, మహిళలకు పెద్దపీట:

తెలంగాణ వస్తే రాష్ట్రంలోని ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు వస్తాయని భావిస్తే నిరాశే మిగిలిందని కవిత వ్యాఖ్యానించారు. మహిళలకు కచ్చితంగా లబ్ధి చేకూర్చాలనే బలమైన సంకల్పంతోనే తాను సొంతంగా పార్టీ పెట్టానని వివరించారు. "ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా ఇక్కడి మహిళలు పడుతున్న కష్టాలు, సమస్యలన్నీ నాకు పూర్తిగా తెలుసు. అలాగే మన నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు రావాల్సి ఉంది" అని చెప్పారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు అవసరమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఎలాంటి శరతులు, గ్యారంటీలు లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు భారీ ఆర్థిక రుణాలను అందిస్తామని కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

### మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి, మే 30:** రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మైనర్, మేజర్ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, పాఠశాల భవనాలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలను విద్యార్థులు చూసిన వెంటనే చదువుపై ఆసక్తి పెరిగేలా, పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలురు, బాలికల వసతి గృహాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉ



ర్దూ మీడియం ప్రారంభానికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థలు, వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తున్నందున సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# హైదరాబాద్‌పై నజర్

- జీహెచ్ఎంసీ ఎన్నికలే ప్రధాన లక్ష్యమా?
- తెలంగాణ అస్తిత్వం వర్సెస్ సెటిలర్ ఓట్ల చర్చ
- మారుతున్న నగర రాజకీయ సమీకరణాలు
- గుర్తింపు రాజకీయాల వైపు మళ్లుతున్న ప్రచారం
- ప్రధాన పార్టీల ఫోకస్ అంతా గ్రేటర్‌పైనే



**హైదరాబాద్, మే 30:** గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నగర అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు, మూసీ ప్రక్షాళన, చెరువుల పరిరక్షణ వంటి పట్టణ అంశాలతో పాటు ప్రాంతీయ భావోద్వేగాలు, సామాజిక గుర్తింపు రాజకీయాలు కూడా ఎన్నికల చర్చలో భాగమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలు ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే హైదరాబాద్ ఓటర్ల మనోభావాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవల నగరంలో చోటుచేసుకున్న కొన్ని రాజకీయ, సామాజిక పరిణామాలు తెలంగాణ అస్తిత్వం, సెటిలర్ ఓటు, ప్రాంతీయ భావోద్వేగాల చుట్టూ కొత్త చర్చకు దారితీశాయి. సోషల్ మీడియాలో తెలంగాణ-ఆంధ్ర వాదనలు మళ్లీ వినిపించడం, రాజకీయ నాయకుల వ్యాఖ్యలు వైరల్ కావడం, కొన్ని ప్రతీకాత్మక అంశాలపై వివాదాలు చెలరేగడం నగర రాజకీయాలపై ప్రభావం చూపుతున్నట్లు కనిపిస్తోంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మక ఎన్నికలుగా జీహెచ్ఎంసీ ఎన్నికలను రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నాయి. రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, మీడియా కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో ఆధిపత్యం సాధించడం ఏ పార్టీకి అయినా కీలకంగా మారింది. అందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మూడు పార్టీలు కూడా నగర ఓటర్లపై ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లో సెటిలర్ ఓటు ప్రభావం చాలా కాలంగా చర్చలో ఉన్న అంశమే. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో స్థిరపడిన ఓటర్లు అనేక డివిజన్లలో ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో తెలంగాణ ఉద్యమం ద్వారా రాజకీయ చైతన్యం పొందిన వర్గాలు కూడా తమ గుర్తింపును కీలక అంశంగా చూస్తున్నాయి. దీంతో సెటిలర్ ఓటు, తెలంగాణ అస్తిత్వ ఓటు రెండూ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ అభివృద్ధి, పరిపాలనను ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా, బీజేపీ జాతీయ రాజకీయ అంశాలతో పాటు నగరంలో తన బలాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని మళ్లీ ప్రజల ముందుకు తీసుకురావాలనే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే జీహెచ్ఎంసీ ఎన్నికల అసలు నరేటివ్ ఏదన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. నగర సమస్యలే ప్రధాన చర్చగా మారుతాయా? లేక తెలంగాణ అస్తిత్వం, ప్రాంతీయ భావోద్వేగాలు, గుర్తింపు రాజకీయాలే ఎన్నికల కేంద్రబిందువుగా నిలుస్తాయా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే హైదరాబాద్ రాజకీయాలు కేవలం అభివృద్ధి చర్చలకే పరిమితం కాకుండా కొత్త సామాజిక, రాజకీయ సమీకరణాల వైపు కదులుతున్నట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో పార్టీల ప్రచార వ్యూహాలు, ప్రజా స్పందనే ఈ ఎన్నికల దిశను నిర్ణయించే అవకాశముంది.



# కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధం

### జీవో-17 రద్దయ్యే వరకు పోరాటం ఆగదు: కేటీఆర్
### కాంట్రాక్టుల్లో రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం
### 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది
### 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తయారు చేస్తాం


**హైదరాబాద్, మే 30:** కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్డుపైకి తెచ్చిన జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీలు, వందలాది హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు అన్ని వర్గాలను నట్టేట ముంచిందని ఆరోపించారు. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్లలో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం చొప్పున మొత్తం 72 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించి, బడుగు వర్గాలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, పాలు, చికెన్, బ్రెడ్ వంటి వస్తువుల టెండర్లను కూడా పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు జీవో నెం.17ను తీసుకొచ్చారని ఆరోపించారు. దీనివల్ల వేలాది మంది చిన్న కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. జీవో నెం.17 రద్దయ్యే వరకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కాంట్రాక్టుల్లో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం "రెన్యువల్ ముఖ్యమంత్రి" మాత్రమేనని విమర్శించిన ఆయన, 2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బడుగు, బలహీన వర్గాలకు చెందిన 50 వేల మంది యువతను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థిని భవితకు అండగా మంత్రి కోమటిరెడ్డి

### స్కూల్ ఫీజు రూ.60 వేలు చెల్లింపు..
### అదనంగా రూ.20 వేలు ఆర్థిక సాయం

**హైదరాబాద్, మే 30:** రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. పదో తరగతిలో 600 మార్కులకు 582 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థిని భవిత, ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్కూల్ ఫీజు చెల్లించలేక సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విషయం సోషల్ మీడియా ద్వారా మంత్రి దృష్టికి చేరింది. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి, విద్యార్థిని వివరాలు తెలుసుకుని స్కూల్ ప్రిన్సిపల్‌తో స్వయంగా మాట్లాడారు. అనంతరం భవితను మినిస్టర్స్ క్వార్టర్స్‌కు పిలిపించి ఆమె విద్యాభ్యాసం, కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీశారు. పాలిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 634వ ర్యాంకు సాధించిన భవిత ఉన్నత విద్యపై ఆసక్తి వ్యక్తం చేయగా, మంత్రి వెంటనే స్కూల్‌కు బకాయిగా ఉన్న రూ.60 వేల ఫీజును చెల్లించి సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే తక్షణ అవసరాల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన మంత్రి, అవసరమైతే ల్యాప్‌టాప్ సహా ఇతర సాయాల కోసం తనను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మానవత్వంతో చేసే సేవే నిజమైన దైవత్వమని పేర్కొన్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో తమ సమస్య పరిష్కారమైందని, ఆయన చేసిన సహాయాన్ని జీవితాంతం మర్చిపోలేమని విద్యార్థిని భవిత, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





# జనాభా పెరుగుదల కాదు వసతుల కల్పనే దేశ ప్రగతికి మూలాధారం!

దేశాభివృద్ధి అనగానే చాలామంది జీడీపీ వృద్ధి, పారిశ్రామిక ప్రగతి, సాంకేతిక పురోగతి వంటి అంశాలను ప్రస్తావిస్తారు. కానీ ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందిందా లేదా అన్నది అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను బట్టి నిర్ణయించాలి. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, సురక్షిత నివాసం, ఉపాధి అవకాశాలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, సామాజిక భద్రత అందుతున్నాయా లేదా అన్నదే అసలు కొలమానం. ఈ అంశాల్లో ఇంకా అనేక లోపాలు ఉన్న దేశంలో జనాభా పెంపును ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనాభా పెంపుపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. మూడో సంతానానికి రూ.30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించడం ద్వారా ఎక్కువ మంది పిల్లలను కనాలని పరోక్షంగా ప్రోత్సహించారు. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పునర్విభజనలో నష్టం జరిగే అవకాశాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. అయితే రాజకీయ లాభనష్టాల కంటే ప్రజల జీవన ప్రమాణాలే ముఖ్యమన్న వాస్తవాన్ని పాలకులు మరవకూడదు. ప్రస్తుతం దేశంలో ఉన్న జనాభాకే సరిపడా మౌళిక వసతులు అందుబాటులో లేవన్నది వాస్తవం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లేమి, ఉపాధ్యాయుల కొరత సమస్యలు కొనసాగుతున్నాయి. లక్షలాది మంది యువత ఉన్నత విద్య పూర్తిచేసినా ఉపాధి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. పట్టణాల్లో నివాస సమస్యలు, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, తగిన మౌలిక వసతుల లేమి రోజురోజుకు పెరుగుతున్నాయి.

దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువకులు ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నప్పటికీ, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నిరుద్యోగం ఇప్పటికే తీవ్రమైన సమస్యగా మారింది. మరోవైపు వ్యవసాయ రంగం కూడా అనిశ్చితితో కొట్టుమిట్టాడుతోంది. రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీరు, రుణ సౌకర్యాల కోసం పోరాడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో జనాభా పెంపు గురించి మాట్లాడటం కంటే ప్రస్తుతం ఉన్న జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చే దిశగా చర్యలు తీసుకోవడం అత్యవసరం. జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక ప్రభావాలను కూడా విస్మరించరాదు. అధిక జనాభా కారణంగా వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. భూమి, నీరు, ఆహార వనరుల వినియోగం పెరుగుతుంది. పర్యావరణంపై అదనపు భారం పడుతుంది. ఇప్పటికే వాతావరణ మార్పులు, నీటి కొరత, పర్యావరణ సంక్షోభం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా నియంత్రణను వదిలేసి పెంపును ప్రోత్సహించడం భవిష్యత్ తరాలపై మరింత భారం మోపే ప్రమాదం ఉంది. మహిళల కోణంలో ఈ అంశాన్ని పరిశీలిస్తే మరిన్ని ఆందోళనకర అంశాలు కనిపిస్తాయి. ఇప్పటికీ దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు వివాహం, సంతానం, కుటుంబ బాధ్యతల విషయంలో సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు ముందుకు సాగుతున్న తరుణంలో ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రోత్సహించడం వారిపై అదనపు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. ప్రసూతి సమయంలో సరైన వైద్యం అందక తల్లీబిడ్డల మరణాలు సంభవిస్తున్న సంఘటనలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. పిల్లలను కనమని చెప్పడం సులభమే. కానీ వారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు కల్పించగలమా అనే ప్రశ్నకు ముందుగా సమాధానం చెప్పాలి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. పిల్లల పోషణ, విద్య, ఆరోగ్యం కోసం మరిన్ని వనరులు కేటాయించాలి. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇవన్నీ చేయకుండా కేవలం నగదు ప్రోత్సాహకాలు ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, జనాభా ఎక్కువగా ఉండటం వల్లే దేశం బలంగా మారుతుందనుకోవడం పొరపాటు. ప్రపంచంలో జనాభా తక్కువగా ఉన్న అనేక దేశాలు అభివృద్ధిలో అగ్రస్థానాల్లో ఉన్నాయి. వారి బలం జనాభా సంఖ్యలో కాదు, మానవ వనరుల నాణ్యతలో ఉంది. విద్యావంతులు, నైపుణ్యం కలిగిన యువత, సమర్థవంతమైన పరిపాలన, నాణ్యమైన మౌళిక వసతులే ఆ దేశాల విజయానికి కారణం. ప్రభుత్వాలు ప్రజల సంఖ్య పెంచడం కంటే ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంపై దృష్టి సారించాలి. ప్రతి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి పిల్లవాడికి నాణ్యమైన విద్య, ప్రతి యువకుడికి ఉపాధి అవకాశం, ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందేలా చర్యలు తీసుకోవాలి. మహిళల విద్య, ఉపాధి, భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మౌళిక వసతుల అభివృద్ధి, మానవ వనరుల నాణ్యత పెంపు ద్వారానే దేశం నిజమైన అభివృద్ధిని సాధించగలదు. అందుకే నేడు అవసరమైన చర్చ "ఎంత మంది పిల్లలను కనాలి?" అనేది కాదు. "ఇప్పుడున్న ప్రజలకు ఎంత మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించగలుగుతున్నాం?" అనేదే. జనాభా పెంపు కంటే మౌళిక వసతుల కల్పనే దేశ భవిష్యత్తును నిర్ణయించే అసలైన అంశం. ప్రజల అవసరాలను తీర్చగలిగినప్పుడే అభివృద్ధి సార్థకమవుతుంది. లేకపోతే జనాభా పెరుగుదల మరో భారంగా మారే ప్రమాదం ఉంది.

**డాక్టర్ కంచర్ల అచ్యుత రావు**
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# ఉగ్ర కుట్ర భగ్నం



- ఢిల్లీ, ముంబై, పంజాబ్‌లలో భారీ దాడులకు కుట్ర
- ఐఎస్ఐ, దావూద్ లింకులతో 9 మంది అరెస్ట్
- ఉన్నత విద్యావంతులే సూత్రధారులు!



**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున ఉగ్రదాడులు జరపడానికి వ్యూహం రచించిన తొమ్మిది మంది నిందితులను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్టు చేశారు. పట్టుబడిన ఈ ముఠాకు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, అలాగే అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో నేరుగా సంబంధాలు ఉన్నట్లు పోలీసులు ధృవీకరించారు. నిందితులు ఢిల్లీ, ముంబై, పంజాబ్ ప్రాంతాలకు చెందిన వారని, వీరిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారని ఉన్నతాధికారులు వెల్లడించారు. అరెస్ట్ చేసిన సమయాల్లో వారి స్థావరాల నుంచి పలు అధునాతన ఆయుధాలను, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఉగ్రవాదులు దేశంలోని కీలక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో తేలింది. ముఖ్యంగా అణుకేంద్రాలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లు, పవర్‌ప్లాంట్లు వంటి వ్యూహాత్మక ప్రాంతాలపై దాడులు చేయడానికి వీరు స్కెచ్ వేశారు. ప్రజల రక్షణలో ఉండే భద్రతా దళాలను కూడా టార్గెట్ చేసే యోచనలో వీరు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఉగ్రమూక కదలికలపై గత కొంతకాలంగా నిరంతరం నిఘా ఉంచిన పోలీస్ యంత్రాంగం, సరైన సమయంలో దాడి చేసి వీరిని అదుపులోకి తీసుకుంది. ఈ కుట్ర వెనుక పాకిస్థాన్ పాత్ర ఏ మేరకు ఉంది, వీరికి విదేశాల నుంచి అందుతున్న ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, మరియు వీరిని నడిపిస్తున్న విదేశీ హ్యాండ్లర్లు ఎవరు అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారంతో అక్కడి పోలీసులు పూర్తిగా అప్రమత్తమయ్యారు. నిఘా వర్గాలు, కేంద్ర పారామిలిటరీ దళాల సమన్వయంతో అన్ని జిల్లాల పోలీస్ యూనిట్లు హైఅలర్ట్‌లో ఉన్నాయి. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో 15 మంది మరణించిన ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రస్తుత కేసులో పట్టుబడిన నిందితులందరూ ఉన్నత విద్యావంతులు కావడంతో, సాంకేతికతను వాడుకుంటూ సాగుతున్న 'వైట్ కాలర్ ఉగ్రవాదం'పై కూడా పోలీసులు గట్టి నిఘా పెట్టారు.



# సాంకేతిక సమస్యతో సీయూఈటీ పరీక్ష ఆలస్యం

## కేంద్రంపై ప్రతిపక్షాల విమర్శలు

**న్యూఢిల్లీ, మే 30:** డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) శనివారం పలు పరీక్షా కేంద్రాల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోగా, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత అతిషి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. "మొదట నీట్, తరువాత సీబీఎస్ఈ, ఇప్పుడు సీయూఈటీ.. జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో కేంద్రం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆమె సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కూడా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. "నాలుగు పరీక్షలు, కోటి మంది విద్యార్థులు.. కానీ ఒక్క పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారు" అని విమర్శించారు. విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ప్రభుత్వానికి యువతే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ అంశంపై స్పందించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ), కొన్ని కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన కారణంగా పరీక్ష ప్రారంభంలో జాప్యం జరిగిందని తెలిపింది. అయితే సమస్యను వెంటనే పరిష్కరించి పరీక్షలను సజావుగా నిర్వహించామని వెల్లడించింది. ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అదనపు సమయం కేటాయించినట్లు పేర్కొంది. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించాల్సిన కొన్ని షిఫ్టుల సమయాల్లో కూడా మార్పులు చేసినట్లు ఎన్‌టీఏ తెలిపింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసినట్లు వెల్లడించింది. కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలతో పాటు పలు ప్రైవేటు యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సీయూఈటీ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ ఏడాది పరీక్షలు మే 11 నుంచి మే 31 వరకు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

# ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి

## ఆర్‌బీఐ నివేదికలో పలు అంశాలు వెల్లడి

**ముంబయి, మే 30:** దేశంలో నకిలీ నోట్ల అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు 2025-26లో 5.7 శాతం పెరిగిందని భారత రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. దీనికి ఆన్‌లైన లేదా కరెన్సీ రహిత ప్రవాహం పెరగాలని సూచిస్తున్నారు. నోట్ల రద్దు చేసినా నకిలీ నోట్ల ముద్రణ ఆగడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ముఖ విలువ రూ.200, రూ.500 ఉన్న నోట్లే ఇందులో ఎక్కువగా వుంటున్నాయని తెలిపింది. 2025-26లో మొత్తంగా నకిలీ నోట్ల సంఖ్య 2,29,746కి పెరిగిందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2,17,396గా వుందని ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2024-25లో నకిలీ రూ.500 నోట్లు 20.5 శాతం పెరిగాయి. అంతకుముందు 1,17,722 గుర్తించగా, తర్వాత ఆ సంఖ్య 1,41,907కి చేరింది. అలాగే రూ.20 ముఖ విలువ ఉండే నోట్లు నకిలీ చలామణి కూడా బాగా పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. ఏడాది క్రితం 253 నోట్లు బయటపడగా అవి 47.4శాతం పెరిగి 373కి చేరాయి. 200 నకిలీ నోట్ల సంఖ్య తగ్గింది. 2024-25లో 32,600 వుండగా, 2025-26లో 30,591కి పడిపోయింది. అలాగే వంద నోట్ల నకిలీ కూడా తగ్గింది. 51,069 నుండి 45,621కి పడిపోయింది. రూ.50నోట్లు నకిలీ కూడా 12,015 నుండి 10,274కి తగ్గింది. 2 వేల నోట్లు చలామణి నుండి ఉపసంహరించడంతో వాటి నకిలీ దాదాపు పడిపోయిందని చెప్పవచ్చు. అంతకుముందు ఏడాదిలో 3508 బయటపడగా, 2025-26లో ఈ సంఖ్య 824కి తగ్గిపోయింది. ఆర్ బి ఐలో 2.4శాతం అంటే 5,412 నకిలీ నోట్లు కనుగొనగా ఇతర బ్యాంకుల్లో మొత్తంగా 97.6శాతం అంటే 2,24,334 నోట్లు కనుగొన్నారని నివేదిక పేర్కొంది. ఇంకా పోలీసులు, ఇతర ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నవి ఇందులో కలపలేదని తెలిపింది. పాడైపోయిన నోట్లను తీసివేయడం బాగా తగ్గిందని నివేదిక పేర్కొంది. 2025-26లో ఈ సంఖ్య 1.72లక్షల నోట్లుగా వుండగా అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 2.38 లక్షలుగా వుంది.



# ఆపరేషన్ సిందూర్ 2.0కు సిద్ధం..

## పాక్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక

**న్యూఢిల్లీ, మే 30:** అవసరమైతే 'ఆపరేషన్ సిందూర్ 2.0' చేపట్టేందుకు భారత సాయుధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. దేశ భద్రతకు ఎలాంటి ముప్పు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత త్రివిధ దళాలకు ఉందని పేర్కొన్నారు. పుణెలో నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) 150వ పాసింగ్ ఔట్ పరేడ్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, శాంతి అనేది తాత్కాలిక పరిస్థితి మాత్రమేనని, అవసరమైతే ఆపరేషన్ సిందూర్ రెండో దశకు కూడా సైన్యం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్ యుద్ధాలు కేవలం భూమి, సముద్రం, ఆకాశానికే పరిమితం కావని, అంతరిక్షం, సైబర్, కాగ్నిటివ్ డొమెయిన్లలో కూడా పోరాటాలు సాగే అవకాశాలు ఉన్నాయని ద్వివేది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సైనిక వ్యూహాలు, భద్రతా చర్యలు, సాంకేతిక సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.



ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించే శక్తి తమకు ఉందని నిరూపించిందన్నారు. భవిష్యత్ యుద్ధాల్లో ప్రజల విశ్వాసం, జాతీయ ఐక్యత కూడా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత సాయుధ దళాల సామర్థ్యంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ఇందులో యువత పాత్ర ఎంతో ముఖ్యమని ఆర్మీ చీఫ్ తెలిపారు. ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా డ్రోన్ బెటాలియన్లు, దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్లు, భైరవ్ బెటాలియన్లు వంటి సాంకేతిక ఆధారిత ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. నెట్‌వర్కింగ్, డేటా ఆధారిత యుద్ధ వ్యూహాలు భవిష్యత్‌లో కీలక వనరులుగా మారనున్నాయని పేర్కొన్న ఆయన, డ్రోన్ల వినియోగంపై అన్ని సైనిక శిక్షణ అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. భారత భద్రతకు ఎలాంటి ముప్పు వచ్చినా తగిన ప్రతిస్పందన ఇవ్వడానికి త్రివిధ దళాలు అప్రమత్తంగా, సర్వసన్నద్ధంగా ఉన్నాయని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు.



## తెలుగు మహిళా చైతన్యానికి తొలి చిరునామా

### నేడు దేశ బాంధవి దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో మహిళల పాత్ర ఎంతో విశిష్టమైనది. దేశ స్వేచ్ఛ కోసం పురుషులతో సమానంగా పోరాడి త్యాగాలు చేసిన మహిళల్లో దువ్వూరి సుబ్బమ్మ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన తొలి తెలుగు మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. దేశభక్తి, ధైర్యసాహసాలు, సామాజిక సేవతో తెలుగు మహిళలకు ఆదర్శంగా నిలిచిన దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి నేడు. తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలో 1880 నవంబర్‌లో మల్లాది సుబ్బావధాని దంపతులకు జన్మించిన సుబ్బమ్మ చిన్న వయసులోనే దువ్వూరి వెంకయ్యతో వివాహం జరిగింది. అయితే బాల్య వయసులోనే భర్తను కోల్పోయి వితంతువుగా మారారు. ఆ కాలంలో మహిళలపై ఉన్న సామాజిక ఆంక్షలను లెక్కచేయకుండా దేశసేవనే లక్ష్యంగా ఎంచుకున్నారు. మహాత్మా గాంధీ పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టిన సుబ్బమ్మ సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ అనేక సభల్లో ప్రసంగించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నందుకు పలుమార్లు జైలు శిక్షను అనుభవించారు. ఒక సందర్భంలో బ్రిటిష్ అధికారులు క్షమాపణ చెబితే విడుదల చేస్తామని చెప్పగా, "నా కాలి గోరు కూడా అలా చేయదు" అని ధైర్యంగా సమాధానమిచ్చి తన దేశభక్తిని చాటుకున్నారు. ఆమె నిబద్ధతను చూసి మహాత్మా గాంధీ సైతం ప్రశంసించారు. స్వాతంత్ర్యోద్యమంతో పాటు మహిళల విద్యాభివృద్ధి కోసం కూడా దువ్వూరి సుబ్బమ్మ విశేషంగా కృషి చేశారు. రాజమండ్రిలో బాలికల కోసం 'సనాతన స్త్రీవిద్యాలయం' స్థాపించి విద్యాబోధనకు తోడ్పడ్డారు. మహిళల్లో చైతన్యం పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఖద్దరు ప్రచారం, విరాళాల సేకరణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో ఆమె అందించిన సేవలకు గుర్తింపుగా 'దేశ బాంధవి' అనే గౌరవ బిరుదును ప్రదానం చేశారు. దాదాపు 16 సంవత్సరాల పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సభ్యురాలిగా సేవలందించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంచి ఆనందాన్ని పంచుకున్న సుబ్బమ్మ, జీవితాంతం ప్రజాసేవకు అంకితమయ్యారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మరణించిన రోజునే, 1964 మే 31న ఆమె కన్నుమూశారు. స్వాతంత్ర్యోద్యమంలో ధైర్యసాహసాలతో ముందుండి పోరాడిన దువ్వూరి సుబ్బమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. దేశభక్తి, త్యాగం, సామాజిక చైతన్యానికి ప్రతీకగా ఆమె చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

## ధూమపానం... ఆరోగ్యానికి హానికరం

### నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం




సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ఆకుల ద్వారా తయారై, కాల్చినప్పుడు పొగను విడుదల చేయడం వలనే దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయోగిస్తుంటారు. చారిత్రక ఆధారాల ప్రకారం క్రీస్తు పూర్వం 1400 ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వివిధ వేడుకల్లో పొగ తాగడం ఒక ఆచారంగా ఉండేది. పొగాకు చుట్టల నుంచి వెలువడే ధూమ మేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు బలంగా నమ్మేవారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభమయ్యాక, క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారతదేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారతదేశంలో ఎక్కువగా గంజాయితోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఒక ఔషధంగా పరిగణించడం విశేషం. సిగరెట్ల కంపెనీలు వైద్యులతోనే వ్యాపార ప్రకటనలు ఇప్పించి ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. అయితే, పొగాకు వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక అనర్థాలు తలెత్తుతున్నట్లు శాస్త్రీయంగా గుర్తించిన తర్వాతే పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) సహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రం చేశాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా, పెరూ దేశాలను పొగాకు జన్మస్థలంగా పరిగణిస్తారు. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకురాబడిన పొగాకు సాగు.. క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యూఎస్ఎస్ఆర్ భూభాగం, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, ఉక్రెయిన్ వంటి దేశాలకు విస్తరించింది. పొగాకు




వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ప్రతి ఏటా మే 31వ తేదీని 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం'గా నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 110 కోట్ల మంది పొగ తాగుతున్నారని, ఏటా పొగాకు కారణంగా దాదాపు 70 లక్షల మంది మరణిస్తున్నారని డబ్ల్యూహెచ్ఓ గణాంకాలు చెబుతున్నాయి. 1987లో జరిగిన ప్రపంచ ఆరోగ్య సంస్థ సమావేశంలో మొదట 1988, ఏప్రిల్ 7ను ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగదారులను ఆ రోజున 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరారు. ఆ తర్వాత 1988లోనే జరిగిన మరో సమావేశంలో, ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రకటించారు. ప్రపంచంలోనే అత్యధికంగా కిరిబాటి దీవిలో మూడు వంతుల్లో రెండొంతుల మంది పురుషులు, మూడొంతుల మంది మహిళలు ధూమపానానికి అలవాటు పడ్డారు. యూరప్‌లోని మాంటెనెగ్రో దేశంలో 46 శాతం మందికి ఈ అలవాటుంది. గ్రీస్‌లో 50 శాతం మంది మగవాళ్లు, 35 శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80 శాతం మంది పురుషులు పొగ తాగుతుండగా, అక్కడ కేవలం 6 శాతం మంది మహిళలకు మాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15 ఏళ్లు పైబడిన మగవాళ్లలో 60 శాతం మంది, మహిళల్లో 23 శాతం మంది పొగ తాగుతున్నారు. ఇక తక్కువగా పొగ తాగేవారు ఉండే దేశాల జాబితాలో ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా ముందువరుసలో ఉన్నాయి. ఆఫ్రికా ఖండంలో కేవలం 14 శాతం మంది మాత్రమే పొగ తాగుతారని నివేదికలు చెబుతున్నాయి. ఇటీవలి కాలంలో విస్తృతంగా జరుగుతున్న అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గడం కొంత ఉపశమనం కలిగించే అంశం. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును మార్కెట్లో రకరకాలుగా విక్రయిస్తున్నారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం, ఇది మానవులను ధూమపానం వ్యసనానికి బానిసలుగా మారుస్తుంది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. ఇది శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరితిత్తులకు తీవ్ర ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ) లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు క్యాన్సర్, గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా, పొగ తాగే వారి పక్కన ఉండి ఆ పొగను పీల్చే (పాసివ్ స్మోకింగ్) వారికి కూడా సమానమైన ముప్పు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న క్యాన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్-కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్సీడీ) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తున్నాయి. పొగాకు ఊపిరితిత్తులను పూర్తిగా దెబ్బతీయడం వల్ల తాగే వారిలో తీవ్ర శ్వాస సంబంధిత సమస్యలతో పాటు అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు వస్తుంది. 80 శాతం కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానమే కారణమని తేలింది. ఒక సిగరెట్‌లో 70కి పైగా హానికరమైన, క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. గతంలో కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో పొగ తాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందనే భయం ఒక కారణమైతే, లాక్‌డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు మూసివేయడం, ఇళ్ల నుండి బయటికి వెళ్లలేకపోవడం వల్ల పొగాకు వాడకం తాత్కాలికంగా తగ్గింది. సమాజంలో ఈ మహమ్మారి అలవాటును దూరం చేయాలంటే కేవలం చట్టాలు, ఆంక్షలు మాత్రమే సరిపోవు; ప్రతి ఒక్కరిలోనూ స్వీయ నియంత్రణ, ఆరోగ్య స్పృహ పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

## ట్రెండ్ సెట్టర్ ఘట్టమనేని కృష్ణ



### ఆంధ్రా జేమ్స్ బాండ్ జయంతి

తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప నటుడు కృష్ణ. నిజానికి తెలుగు చిత్రసీమలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. నట శేఖరునిగా, సూపర్ స్టార్ గా స్వయం కృషితో తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్న గొప్పతనం ఆయనది. ఎన్టీఆర్ లాగా పౌరాణికాల, ఏ ఎన్ ఆర్ లాగా సాంఘికాల, కాంతారావు లాగా జానపదాల, శోభన్ బాబు లాగా కుటుంబ కథా భరితమైన, ఉదాత్తమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలలో నటించకున్నా, చిరంజీవి లాగా నృత్యం చేయ లేక పోయినా, ఇవన్నీ పక్కన పెట్టి, మాస్ ఓరియంటెడ్, ఎంటర్టైనర్ కౌబాయ్ జేమ్స్ బాండ్ చిత్రాలలో నటించి, యువతను థియేటర్ బాట పట్టించి, ఎందరికో రోల్ మోడల్ గా నిలిచిన అసాధ్యుడు కృష్ణ. కృష్ణ సాధించింది మామూలు స్టార్ డమ్ కానే కాదు. ఒక సమయంలో ఊరూరా కృష్ణకు రికార్డు స్థాయిలో 2500 అభిమాన సంఘాలు ఉండేవి అంటే అది సామాన్య విషయం కాదు. సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్ పై పట్టు ఉన్న కృష్ణ తెలుగు చిత్ర పరిశ్రమలో చేయని ప్రయోగం లేదు. తెలుగు వెండి తెరకు సరికొత్త ఒరవడులు దిద్దుతూ.. ఆయన పరిచయం చేయని కొత్త ప్రయోగం అంటే అతిశయోక్తి కాదు. కృష్ణ (ఘట్టమనేని శివరామ కృష్ణ మూర్తి) తెలుగు సినిమా నటుడు, దర్శకుడు, నిర్మాత. 1942 మే 31 న గుంటూరు జిల్లా, తెనాలి మండలం తెనాలి పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలోని బుర్రిపాలెం గ్రామస్తులైన ఘట్టమనేని వీర రాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతుల పెద్ద కొడుకుగా జన్మించాడు. 1964లో ప్రముఖ దర్శక నిర్మాత ఆదుర్తి సుబ్బారావు అందరూ కొత్తవాళ్ళతో తాను తీస్తున్న తేనె మనసులు కోసం కొత్త నటులు కావాలని ఇచ్చిన పత్రికా ప్రకటనకు తన ఫోటోలు పంపించి, పలు వడపోతల తర్వాత ఆదుర్తి సుబ్బారావు ద్వారా కృష్ణన ఇద్దరు కథా నాయకుల్లో ఒకడిగా ఎంపిక కాబడినాడు. అలా తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టిన కృష్ణ నట జీవితం ఉదయం, మధ్యాహ్నం మాత్రమే కాక మూడవ షిఫ్ట్ రాత్రి పది గంటల నుంచి తెల్లవారు జామున 2 గంటల వరకు ఉండేది. చివరికి నిద్ర పోతున్న సమయంలో కాస్ట్యూమ్స్ వేసుకుని పడుకుంటే నిద్రిస్తున్న సన్నివేశాలు చిత్రీకరించుకున్న సందర్భాలు ఉన్నాయి. 1968లో కృష్ణ నటించిన 10 సినిమాలు, 1969లో రికార్డు స్థాయిలో 19 సినిమాలు, 1970లో 16 సినిమాలు, 1971లో 11 సినిమాలు, 1972లో 18 సినిమాలు, 1973లో 15 సినిమాలు, 1974లో 13 సినిమాలు, 1975లో 8 సినిమాలు విడుదల కావడం గమనార్హం. 1972లో ఒకే ఏడాది 17 సినిమాలను విడుదల చేసి రికార్డు సృష్టించాడు. ప్రపంచం లో మరే సినీ నటుడికీ ఇలాంటి రికార్డు లేదు.

తెలుగులో "తొలి జేమ్స్ బాండ్ సినిమా" (గూఢచారి 116), తొలి "కౌబాయ్ సినిమా" (మోసగాళ్ళకు మోస గాడు), తొలి "ఫుల్ స్కోప్ సినిమా" (అల్లూరి సీతారామ రాజు), "తొలి 70 ఎంఎం సినిమా" (సింహాసనం) వంటివి సూపర్ స్టార్ కృష్ణ సినిమాలే. తెలుగులో సాంతకేతికం గానూ పలు తొలి తెలుగు సినిమాలు కృష్ణవే. కొల్లేటి కాపురంతో తెలుగులో ఆర్.ఓ. సాంకేతికత పరిచయం చేశాడు. మొదటి ఓఆర్‌డబ్ల్యు కలర్ సాంకేతిక తతో తీసిన సినిమా గూడుపు ఠాణి. తొలి తెలుగు ఫ్యూజీ కలర్ చిత్రం భలే దొంగలు. తెలుగులో 70 ఎంఎం సాంకేతికత ఉపయోగించిన తొలి సినిమా సింహాసనం. సింహాసనం సినిమా స్టీరియోఫోనిక్ 6 ట్రాక్ సాంకేతికతతో సౌండ్ టెక్నాలజీ వాడిన తొలి తెలుగు సినిమా. అల్లూరి సీతారామరాజు తెలుగులో ఫుల్‌స్కోప్ సినిమాల్లో మొదటిది. బాక్సాఫీస్ రికార్డుల పరంగా చూస్తే, మద్రాస్ నగరంలో వంద రోజులు పూర్తిచేసుకున్న తొలి తెలుగు చిత్రంగా చీకటి వెలుగులు, హైదరాబాద్ నగరంలో ఏడాది పాటు ఆడిన తొలి తెలుగు సినిమాగా అల్లూరి సీతారామరాజు నిలిచిపోయాయి. 1982లో భవనం వెంకట్రామ్ ప్రభుత్వం హైదరాబాద్లో పద్మాలయా సంస్థకు స్టూడియో నిర్మించుకోవడానికి జూబ్లీ హిల్స్ లో 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వగా, 1983 నవంబరు 21న నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు చేతుల మీదుగా పద్మాలయా స్టూడియోస్ ప్రారంభింప చేసుకుని కృష్ణ స్టూడియో యజమాని అయ్యాడు. స్వంత నిర్మాణ సంస్థ పద్మాలయా పిక్చర్స్ ద్వారా 1971లో తీసిన మోస గాళ్ళకు మోసగాడు మాత్రం భారీ విజయాన్ని, సాహసిగా కృష్ణకు పేరును తెచ్చి పెట్టింది. మోస గాళ్ళకు మోసగాడు సినమా ఆంగ్లం లోకి ట్రెజర్ హంట్ పేరిట అనువాదమై 123 దేశాల్లో విడుదలైంది, మంచి విజయాన్ని సాధించింది. కృష్ణకు 1997లో ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం, 2003లో ఎన్టీఆర్ జాతీయ పుర స్కారం, 2008లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 2009లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం వంటి గౌరవాలు లభించాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వం కృష్ణను గౌరవిస్తూ ఓ పోస్టల్ స్టాంప్ కూడా విడుదల చేసింది. 1976లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి కె.వి.రఘునాథ రెడ్డి చేతుల మీదుగా కృష్ణ "నటశేఖర" బిరుదును అందుకున్నాడు. 1972లో జైఆంధ్ర ఉద్యమం జరిగినప్పుడు కృష్ణ ఆ ఉద్యమానికి బహిరంగంగా మద్దతు నిచ్చాడు. 1984 అక్టోబరులో ఇందిరా గాంధీ దారుణహత్యకు గురైనప్పుడు కృష్ణ ఆమె అంత్యక్రియలకు ఢిల్లీ వెళ్ళి, రాజీవ్ గాంధీని కలవడం జరిగింది. అలా 1984లో కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 1989లో కృష్ణ కాంగ్రెస్ తరఫున ఏలూరు లోక్‌సభ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించాడు. 2009 ఎన్నికల్లో వై.ఎస్.రాజశేఖర రెడ్డి కోరక మేరకు కాంగ్రెస్ పార్టీకి కృష్ణ కుటుంబం నైతిక మద్దతు అందించింది. కరువు బాధితుల సహాయ నిధికి సినిమా తారల యాత్ర పేరుతో 1972 అక్టోబరు 28 నుంచి నవంబరు 2 వరకు విజయవాడ, తెనాలి, గుంటూరు, రాజమండ్రి, హైదరాబాద్ లలో తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులను కూడగట్టి కార్యక్రమాలు నిర్వహించాడు. వచ్చిన డబ్బు సహాయ నిధికి అందిం చారు. ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు, పద్మాలయా స్టూడియో అధినేత, మాజీ ఎంపీ, సూపర్‌స్టార్ కృష్ణ (80) 2022 సంవత్సరం నవంబర్ 15న కార్డియాక్ అరెస్టుకు గురై, ఆసుపత్రికి తరలించబడి చికిత్స పొందుతూ తనువు చాలించి, ఆయన తుదిశ్వాస విడిచి, అశేష అభిమానులను శోక సంద్రంలో ముంచి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# భారీగా తగ్గిన బంగారం

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా బంగారం కొనుగోళ్లలో మందగమనం కనిపిస్తున్న నేపథ్యంలో పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. బంగారానికి డిమాండ్ గణనీయంగా తగ్గడంతో పాటు విక్రయాలు కూడా భారీగా పడిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రభావంతో శనివారం బంగారం ధరల్లో గణనీయమైన తగ్గుదల నమోదైంది. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,640గా ఉండగా, శనివారం అది రూ.600 తగ్గి రూ.1,57,040కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.550 తగ్గి రూ.1,43,950గా నమోదైంది. 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.450 తగ్గి రూ.1,17,780 వద్ద కొనసాగుతోంది. ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో రూ.1,57,040గా ఉంది. ఢిల్లీలో రూ.1,57,190గా ఉండగా, చెన్నై, మధురై, కోయంబత్తూరులో రూ.1,59,600గా నమోదైంది. బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ అంతర్జాతీయ పరిస్థితులు, పెట్టుబడి ధోరణులు, డిమాండ్ ఆధారంగా ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి పరిశీలించాలని సూచిస్తున్నారు.

# ముంబైలో మళ్లీ గ్యాస్ ధరల షాక్




**ముంబై:** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో సామాన్యులపై ఇంధన భారం మరింత పెరిగింది. ముంబయి, పరిసర ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరను కిలోగ్రాముకు రూ.2 మేర పెంచినట్లు గ్యాస్ పంపిణీ సంస్థ ప్రకటించింది. కేవలం 16 రోజుల వ్యవధిలో ధరలు పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. వాహనాల కోసం వినియోగించే గ్యాస్‌తో పాటు గృహ అవసరాలకు పైప్‌ల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు ధరలను కూడా పెంచినట్లు సంస్థ వెల్లడించింది. తాజా సవరణతో ముంబయిలో గ్యాస్ ధర కిలోగ్రాముకు రూ.86కు చేరింది. గృహ వినియోగ గ్యాస్ ధర కూడా స్వల్పంగా పెరిగింది. ఈ తాజా పెంపుతో మే నెల మధ్య నుంచి ఇప్పటివరకు గ్యాస్ ధరలు మొత్తం రూ.4 మేర పెరిగినట్లయింది. దీంతో వాహనదారులు, గృహ వినియోగదారులపై అదనపు భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే దేశీయ గ్యాస్ కేటాయింపులు తగ్గడం, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు గ్యాస్ కొనుగోలు చేయాల్సి రావడం, అంతర్జాతీయంగా రూపాయి విలువ క్షీణించడం వంటి కారణాల వల్ల వ్యయం పెరిగిందని సంస్థ తెలిపింది. మరోవైపు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పలు నగరాల్లో గ్యాస్ పంపిణీ సంస్థలు ఇప్పటికే ధరలను పెంచగా, మరికొన్ని సంస్థలు కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో వాహనదారులు, గృహిణుల నెలవారీ ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గోల్డ్ బాండ్‌లకు భారీ లాభం

ముంబై : సావరిన్ గోల్డ్ బాండ్ పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి భారతీయ రిజర్వు బ్యాంకు శుభవార్త అందించింది. 2021-22 రెండో విడత కింద జారీ చేసిన గోల్డ్ బాండ్లకు ముందస్తు విమోచన ధరను ప్రకటిస్తూ యూనిట్‌కు రూ.15,672గా నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం ఈ బాండ్లు జారీ చేసిన సమయంలో ఒక్క గ్రాము ధర రూ.4,792గా ఉండగా, ప్రస్తుతం ప్రకటించిన ధరతో పోలిస్తే పెట్టుబడిదారులకు 227 శాతానికి పైగా రాబడి లభించినట్లైంది. దీంతో అప్పట్లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు సుమారు రూ.3.27 లక్షల విలువ లభించే అవకాశం ఏర్పడింది. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం గోల్డ్ బాండ్ల పూర్తి కాలపరిమితి ఎనిమిది సంవత్సరాలు అయినప్పటికీ, ఐదేళ్లు పూర్తయిన తర్వాత వడ్డీ చెల్లింపు తేదీల్లో ముందస్తు విమోచన సదుపాయం కల్పిస్తారు. ఈ బాండ్లు 2021 జూన్ 1న జారీ కావడంతో ఈ ఏడాది జూన్ 1 నుంచి వాటిని నగదుగా మార్చుకునే అవకాశం కల్పించారు. ముందస్తు విమోచన ధరను నిర్ణయించేందుకు బంగారం మార్కెట్ ధరలను ఆధారంగా తీసుకుంటారు. విమోచన తేదీకి ముందు మూడు పని దినాల్లో నమోదైన స్వచ్ఛమైన బంగారం ముగింపు ధరల సగటు ఆధారంగా ఈ ధరను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో గోల్డ్ బాండ్ పెట్టుబడిదారులకు గణనీయమైన లాభం చేకూరనుంది. బంగారం ధరలు భారీగా పెరగడంతో ఈ పథకం ద్వారా పెట్టుబడి పెట్టిన వారు మంచి రాబడిని పొందుతున్నారని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. సురక్షిత పెట్టుబడితో పాటు బంగారం ధరల పెరుగుదల ప్రయోజనాన్ని అందించే ఈ పథకం మరోసారి పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# జూన్ నుంచి మారనున్న కీలక ఆర్థిక నిబంధనలు

**న్యూఢిల్లీ :** మే నెల ముగిసి జూన్ నెల ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు కీలక ఆర్థిక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. వంటగ్యాస్ ధరల సవరణ నుంచి క్రెడిట్ కార్డుల ఛార్జీలు, మ్యూచువల్ ఫండ్ల నిబంధనలు, ఆధార్ అప్‌డేట్ గడువు వరకు అనేక మార్పులు సామాన్యులపై ప్రభావం చూపనున్నాయి. ప్రతి నెల మాదిరిగానే జూన్ 1న వంటగ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు సమీక్షించనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, ముడి చమురు ధరలను బట్టి గృహ, వాణిజ్య సిలిండర్ల ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు విధానాలకు అనుగుణంగా పలు బ్యాంకులు స్థిర నిక్షేపాలు, రుణాలపై వడ్డీ రేట్లను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్తగా రుణాలు తీసుకునే వారు, ఇప్పటికే నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్న వారిపై ఈ మార్పుల ప్రభావం ఉండొచ్చు. జూన్ నుంచి పలు బ్యాంకులు తమ క్రెడిట్ కార్డు నిబంధనల్లో కూడా మార్పులు తీసుకురానున్నాయి. రివార్డు పాయింట్ల పరిమితి, వినియోగ సేవల బిల్లులపై అదనపు రుసుములు, విమానాశ్రయ విశ్రాంతి కేంద్రాల సదుపాయాల విషయంలో మార్పులు ఉండనున్నట్లు సమాచారం. అందువల్ల వినియోగదారులు తమ బ్యాంకుల తాజా నిబంధనలను పరిశీలించాలని సూచిస్తున్నారు. అత్యంత ముఖ్యంగా ఆధార్ వివరాల ఉచిత సవరణకు సంబంధించిన గడువు జూన్ 14తో ముగియనుంది. పేరు, చిరునామా, పుట్టిన తేదీ వంటి వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా సవరించుకునే




అవకాశం అప్పటి వరకు మాత్రమే ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత రుసుము చెల్లించాల్సి రావచ్చు. మరోవైపు మ్యూచువల్ ఫండ్ లావాదేవీలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు కొత్త నిబంధనలు దశలవారీగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు పెట్టుబడిదారులకు మరింత భద్రత, సౌలభ్యం కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. జూన్ నెలలో అమల్లోకి రానున్న ఈ మార్పులు సామాన్యుల ఆర్థిక ప్రణాళికలపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్న నేపథ్యంలో ప్రజలు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# స్పైస్‌జెట్‌కు రూ.124 కోట్ల పన్ను నోటీసు




**న్యూఢిల్లీ :** ప్రముఖ తక్కువ ఖర్చు విమానయాన సంస్థ స్పైస్‌జెట్ మరోసారి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. జీఎస్టీ రిటర్నులు వరుసగా దాఖలు చేయకపోవడంతో వస్తు సేవల పన్ను శాఖ సంస్థకు రూ.124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేకాకుండా సంస్థ జీఎస్టీ నమోదు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం నిర్దేశిత గడువులో రిటర్నులు సమర్పించకపోవడంతో సంబంధిత నిబంధనల ప్రకారం తాత్కాలిక అంచనా ప్రక్రియ చేపట్టి బకాయిలను ఖరారు చేశారు. వివిధ నెలలకు సంబంధించిన పన్ను బకాయిలను కలిపి మొత్తం రూ.124.65 కోట్ల డిమాండ్‌ను నిర్ణయించినట్లు తెలుస్తోంది. జీఎస్టీ నమోదు రద్దుకు సంబంధించి ఇప్పటికే నోటీసు జారీ చేసినప్పటికీ సంస్థ నుంచి ఇంకా పూర్తి స్థాయి సమాధానం అందలేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న రిటర్నులను వెంటనే దాఖలు చేసి నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్పైస్‌జెట్ ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. గత త్రైమాసికంలో కూడా సంస్థ భారీ నష్టాలను నమోదు చేసినట్లు వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావం సంస్థ షేర్లపై కూడా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పన్ను శాఖ తాజా చర్యలతో స్పైస్‌జెట్ భవిష్యత్ కార్యాచరణపై విమానయాన రంగంలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం సంస్థ ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందనేది కీలకంగా మారింది.

# జూన్‌లో బ్యాంకులకు వరుస సెలవులు

## ముందుగానే ప్లాన్ చేసుకోండి..!

**హైదరాబాద్ :** జూన్ నెలలో బ్యాంకు ఖాతాదారులు తమ ఆర్థిక లావాదేవీలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు విడుదల చేసిన సెలవుల జాబితా ప్రకారం వారాంతపు సెలవులతో పాటు పలు ప్రాంతీయ పండుగల సందర్భంగా బ్యాంకులు మూసివేయబడనున్నాయి. జూన్ 15న వైఎంఏ డే సందర్భంగా మిజోరాంలో, రాజా సంక్రాంతి పండుగ కారణంగా ఒడిశాలో బ్యాంకులు పనిచేయవు. జూన్ 25న మొహర్రం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. జూన్ 26న మొహర్రం సందర్భంగా తెలంగాణ, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో బ్యాంకు సేవలు నిలిచిపోతాయి. జూన్ 29న సంత్ గురు కబీర్ జయంతి కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి. జూన్ 30న రెమ్నా




ని పండుగ సందర్భంగా మిజోరాంలో ప్రాంతీయ సెలవు అమలులో ఉంటుంది. ఇవే కాకుండా దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం అయిన జూన్ 7, 14, 21, 28 తేదీల్లో బ్యాంకులు పనిచేయవు. అలాగే రెండో శనివారం జూన్ 13, నాలుగో శనివారం జూన్ 27న కూడా బ్యాంకు శాఖలు మూసి ఉంటాయి. అయితే బ్యాంకు శాఖలకు సెలవులు ఉన్నప్పటికీ ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎంలు, యూపీఐ సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయి. గూగుల్ పే, ఫోన్‌పే, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను వినియోగదారులు ఎలాంటి అంతరాయం లేకుండా ఉపయోగించుకోవచ్చు. నగదు డిపాజిట్లు, చెక్కుల క్లియరెన్స్, డిమాండ్ డ్రాఫ్టులు లేదా ఇతర శాఖాపరమైన పనులు ఉన్నవారు సెలవుల జాబితాను ముందుగానే పరిశీలించి తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు.


# విక్రయాల కోసం భారీ తగ్గింపు

## టెస్లా మోడల్ వై ధరలో రూ.9 లక్షల కోత..!

**హైదరాబాద్ :** ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ వాహన తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో తన మోడల్ వై కారుపై భారీ ధర తగ్గింపును ప్రకటించింది. దేశీయ మార్కెట్లో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో కంపెనీ ఏకంగా రూ.9 లక్షల మేర ధరను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం భారత విద్యుత్ వాహన రంగంలో చర్చనీయాంశంగా మారింది. భారీ ధరల కారణంగా వినియోగదారులు ఇతర కంపెనీల విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో టెస్లా తన వ్యూహాన్ని మార్చుకుంది. కొత్త ధరలతో మోడల్ వై వాహనం మరింత మందికి అందుబాటులోకి రానుంది. అలాగే భారత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వాహనాల శ్రేణిలో కూడా మార్పులు చేస్తూ కొత్త వేరియంట్లను ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది. ధరల తగ్గింపు వల్ల విద్యుత్ వాహనాల విభాగంలో పోటీ మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేశీయ సంస్థలు, ఇతర అంతర్జాతీయ బ్రాండ్లపై ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశముంది. పెరుగుతున్న పోటీ కారణంగా వినియోగదారులకు మరిన్ని ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతున్న తరుణంలో టెస్లా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. తక్కువ ధరలకు అత్యాధునిక సాంకేతికత కలిగిన వాహనాలను అందించడం




ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవడమే కంపెనీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సమాచారం. ఈ భారీ ధర తగ్గింపు తర్వాత టెస్లా విక్రయాలు ఎంత మేర పెరుగుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## ఆసియా క్రీడల ట్రయల్స్‌లో అదరగొట్టిన వినేశ్..

### తొలి బౌట్‌లో ఘన విజయం..!

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల కోసం నిర్వహిస్తున్న ఎంపికల ట్రయల్స్‌లో ప్రముఖ రెజ్లర్ వినేశ్ పోగట్ శుభారంభం చేసింది. ప్రారంభ బౌట్‌లో జ్యోతిపై 7–1 స్కోరు తేడాతో విజయం సాధించి తన సత్తా చాటింది. మ్యాచ్ ఆరంభంలో కొంత జాగ్రత్తగా ఆడిన వినేశ్, ఆ తర్వాత దూకుడు పెంచి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి పీరియడ్‌లో పుష్ పాయింట్‌తో ఖాతా తెరిచిన వినేశ్, అనంతరం డబుల్ లెగ్ అటాక్‌తో మరిన్ని పాయింట్లు సాధించింది. ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా రక్షణాత్మకంగానూ, దూకుడుగానూ ఆడి ఆధిక్యంలో నిలిచింది. రెండో పీరియడ్‌లో వినేశ్ పూర్తిగా మ్యాచ్‌ను తన నియంత్రణలోకి తీసుకుంది. రైట్ లెగ్ అటాక్‌లతో వరుస పాయింట్లు సాధిస్తూ 3–0 ఆధిక్యం సంపాదించింది. జ్యోతి కూడా లెగ్ అటాక్‌కు ప్రయత్నించినప్పటికీ, ఆ పోరులో వినేశ్ పైచేయి సాధించింది. కౌంటర్ అటాక్‌లో వరుసగా రెండు వేగవంతమైన కదలికలతో స్కోరును 7–0కు చేర్చింది. చివర్లో జ్యోతి ఒక పుష్ ఔట్ పాయింట్ సాధించినప్పటికీ ఫలితాన్ని మార్చలేకపోయింది. ఈ విజయంతో వినేశ్ పోగట్ తదుపరి బౌట్‌లో నిషాతో తలపడనుంది. ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశంపై గతంలో వివాదం నెలకొన్నప్పటికీ, న్యాయపరమైన పోరాటం అనంతరం అవకాశం దక్కించుకున్న వినేశ్ ఇప్పుడు తన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆసియా క్రీడల బెర్త్ కోసం ఆమె పోరాటం ఆసక్తికరంగా మారింది.




## వైభవ్ బ్యాటింగ్ అసాధారణం.. సీనియర్లకూ అసాధ్యం

### సర్ఫరాజ్ ఖాన్

**ముంబై:** రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. చిన్న వయసులోనే వైభవ్ ప్రదర్శిస్తున్న ఆత్మవిశ్వాసం, భారీ షాట్లు ఆడే సామర్థ్యం అసాధారణమని కొనియాడాడు. వైభవ్ హిట్టింగ్ పవర్ గురించి మాట్లాడుతూ, ఎంతో అనుభవం ఉన్న సీనియర్ క్రికెటర్లు కూడా బంతిని అతడు కొట్టినంత సమర్థంగా బాదలేరని సర్ఫరాజ్ పేర్కొన్నాడు. క్రీజులో నిలబడి బంతిని టైమ్ చేసే తీరు, సరైన షాట్ల ఎంపిక అతడి ప్రత్యేకత అని అన్నాడు. అంత చిన్న వయసులోనే ఇంతటి పరిణతి ప్రదర్శించడం సాధారణ విషయం కాదని సర్ఫరాజ్ అభిప్రాయపడ్డాడు. ప్రతి మ్యాచ్‌లోనూ భయం లేకుండా దూకుడుగా ఆడుతూ జట్టుకు కీలక పరుగులు అందిస్తున్నాడని తెలిపాడు. ఐపీఎల్ వేలంలో భారీ ధరకు ఎంపికైనప్పటి నుంచే వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ప్రస్తుతం అతని ప్రదర్శనలు రాజస్థాన్ రాయల్స్‌కు కీలక బలంగా మారాయి. సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్రముఖ ఆటగాడి నుంచి వచ్చిన ప్రశంసలు యువ బ్యాటర్‌కు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. భారత క్రికెట్‌కు వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే సామర్థ్యం అతనిలో కనిపిస్తోందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆసియా క్రీడల ప్రాథమిక జాబితా రెడీ

### వైభవ్‌కు చోటు.. సూర్యకు షాక్!






**న్యూఢిల్లీ :** జపాన్‌లోని ఐచీ–నగోయాలో జరగనున్న ఆసియా క్రీడలను లక్ష్యంగా పెట్టుకుని భారత క్రికెట్ నియంత్రణ మండలి 30 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాథమిక జాబితాను సిద్ధం చేసింది. భారత ఒలింపిక్ సంఘానికి పంపిన ఈ జాబితాలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కగా, ప్రముఖ ఆటగాళ్లు సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ పేర్లు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. అదే సమయంలో వెస్టిండీస్‌తో భారత్ వన్డే, టీ20 సిరీస్ ఆడాల్సి ఉండటంతో రెండు వేర్వేరు జట్లను ఎంపిక చేయాలని బీసీసీఐ భావిస్తోంది. వెస్టిండీస్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ కీలక బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఆయనను ఆసియా క్రీడల జాబితాలో చేర్చలేదని తెలుస్తోంది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు కూడా ఈ జాబితాలో స్థానం దక్కకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. భవిష్యత్తు టోర్నీలను దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. ఆసియా క్రీడల జట్టుకు శ్రేయస్ అయ్యర్, సంజూ శాంసన్ లేదా తిలక్ వర్మలలో ఒకరు నాయకత్వం వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు జాబితాలో చోటు దక్కినప్పటికీ, ఆయన వెస్టిండీస్ సిరీస్‌లో ఆడే అవకాశమే ఎక్కువగా ఉందని తెలుస్తోంది. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా వంటి బౌలర్లతో పాటు కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హర్ష్ దూబే వంటి స్పిన్నర్లకు కూడా ప్రాధాన్యం లభించింది. ప్రాథమిక జాబితాలో యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, అనుకుల్ రాయ్, ఆయుష్ బదోని, హర్ష్ దూబే, ధ్రువ్ జురెల్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, షాబాజ్ అహ్మద్, శివం దూబే, విప్రజ్ నిగమ్, హర్షిత్ రాణా, యశ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు. ఆసియా క్రీడల్లో మరోసారి పసిడి పతకాన్ని గెలుచుకోవడమే లక్ష్యంగా బీసీసీఐ యువ ఆటగాళ్లపై దృష్టి సారించినట్లు ఈ జాబితా స్పష్టం చేస్తోంది.

# ఆరెంజ్ క్యాప్ కోసం త్రిముఖ పోరు

### వైభవ్‌కు గిల్, సుదర్శన్ సవాల్!



**అహ్మదాబాద్ :** ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకోగా ఆరెంజ్ క్యాప్ విజేత ఎవరు అన్న ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 776 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ, గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ అతడికి గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. లీగ్ దశలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై శతకం సాధించిన అతడు, ఎలిమినేటర్‌లో 97 పరుగులు, క్వాలిఫయర్–2లో 96 పరుగులతో మెరిశాడు. మొత్తం 776 పరుగులతో ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ క్వాలిఫయర్–2లో సెంచరీతో చెలరేగి తన మొత్తం పరుగులను 722కు చేర్చుకున్నాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ కూడా అర్ధశతకంతో 710 పరుగులకు చేరుకుని రేసులో నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు బ్యాటర్లు 700కు పైగా పరుగులు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. రాజస్థాన్ రాయల్స్ టోర్నీ నుంచి నిష్క్రమించడంతో వైభవ్ ఖాతాలో ఇక పరుగులు చేరే అవకాశం లేదు. అయితే ఫైనల్లో ఆర్సీబీతో జరిగే మ్యాచ్‌లో గిల్ లేదా సుదర్శన్‌లో ఎవరో ఒకరు భారీ ఇన్నింగ్స్ ఆడితే వైభవ్‌ను అధిగమించే అవకాశం ఉంది. దీంతో ఫైనల్ మ్యాచ్ ఆరెంజ్ క్యాప్ విజేతను కూడా నిర్ణయించనుంది. ఇప్పటికే శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ చెరోసారి ఆరెంజ్ క్యాప్ గెలిచారు. 2023లో గిల్ అత్యధిక పరుగులతో విజేతగా నిలవగా, 2025లో సాయి సుదర్శన్ ఆ ఘనత సాధించాడు. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ టైటిల్ కోసం పోటీ పడుతున్నారు. అయితే ఫైనల్లో ఆర్సీబీ పేసర్లు భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ ధాటికి గుజరాత్ ఓపెనర్లు తక్కువ స్కోరుకే పరిమితమైతే, వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకునే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం క్రికెట్ అభిమానుల చూపంతా ఫైనల్‌తో పాటు ఆరెంజ్ క్యాప్ పోరుపైనే ఉంది.

## పరాగ్ వ్యాఖ్యలతో ఏకీభవించని సంగక్కర

### రాజస్థాన్ రాయల్స్‌లో ఆసక్తికర చర్చకు తెర

**అహ్మదాబాద్:** ఐపీఎల్–2026లో రాజస్థాన్ రాయల్స్ ప్రయాణం ముగిసిన అనంతరం జట్టులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కెప్టెన్ రియాన్ పరాగ్ చేసిన వ్యాఖ్యలతో హెడ్ కోచ్ కుమార్ సంగక్కర బహిరంగంగానే విభేదించడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. క్వాలిఫయర్–2 మ్యాచ్ అనంతరం ఇద్దరూ జట్టు లక్ష్యాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన రియాన్ పరాగ్ తమ జట్టులో ఎక్కువ మంది యువ ఆటగాళ్లు, అనుభవం తక్కువ ఉన్న క్రికెటర్లు ఉండటంతో ప్లేఆఫ్స్‌కు చేరుకోవడం కూడా పెద్ద విజయమేనని వ్యాఖ్యానించాడు. సీజన్ ఆరంభంలో రాజస్థాన్ టాప్–4లో నిలుస్తుందని చాలా మంది ఊహించలేదని పేర్కొన్నాడు. అయితే ఈ వ్యాఖ్యలపై స్పందించిన సంగక్కర మాత్రం భిన్నంగా స్పందించాడు. రాజస్థాన్ రాయల్స్ ఎప్పుడూ కేవలం ప్లేఆఫ్స్‌కు చేరడానికే ఆడదని, టైటిల్ గెలవడమే తమ అసలు లక్ష్యమని స్పష్టం చేశాడు. జట్టులోకి ఎంపిక చేసే ప్రతి ఆటగాడిని మ్యాచ్ విజేతగానే భావిస్తామని, అనుభవం కంటే సామర్థ్యానికే ప్రాధాన్యం ఇస్తామని తెలిపాడు. వ్యాఖ్యల విషయంలో విభేదించినప్పటికీ కెప్టెన్‌గా పరాగ్ పనితీరును సంగక్కర ప్రశంసించాడు. పూర్తి స్థాయి నాయకుడిగా తొలి సీజన్‌లోనే పరాగ్ మంచి నిర్ణయాలు తీసుకున్నాడని, మైదానంలో నాయకత్వ లక్షణాలు కనబరిచాడని పేర్కొన్నాడు. భవిష్యత్తులో మరింత సమర్థ కెప్టెన్‌గా ఎదుగుతాడనే విశ్వాసం వ్యక్తం చేశాడు. టోర్నీ ప్రారంభానికి ముందు రాజస్థాన్ అవకాశాలపై అనేక సందేహాలు వ్యక్తమైనప్పటికీ జట్టు ప్లేఆఫ్స్ వరకు చేరి విమర్శకులకు సమాధానం ఇచ్చిందని సంగక్కర పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో ఎదురైన అనుభవాలను పాఠాలుగా తీసుకుని వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి రావడమే తమ లక్ష్యమని వెల్లడించాడు.

# ఐపీఎల్‌లో అరుదైన ఘనత

### వరుసగా రెండుసార్లు హిట్ వికెట్‌గా సాయిసుదర్శన్




**చండీఘడ్:** ఐపీఎల్–2026 సీజన్‌లో రెండుసార్లు సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. వరుస రెండు మ్యాచుల్లో ఇది జరిగింది. బెంగుళూరు, గుజరాత్‌లతో జరిగిన మ్యచ్‌లలో సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. ఇకపోతే క్వాలిఫయర్–2లో గుజరాత్ టైటాన్స్ మరోసారి సత్తాచాటింది. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని 3 వికెట్లు కోల్పోయి ఛేదించి, బెంగళూరుతో తుదిపోరుకు అర్హత సాధించింది. అయితే.. ఈ మ్యాచ్‌లో జీటీ ఓపెనర్ సాయి సుదర్శన్ ఔటైన తీరే చర్చనీయాంశమవుతోంది. బ్రిజేష్ శర్మ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ వైపు బౌండరీ కొట్టిన అనంతరం అతడి చేతిలోని బ్యాట్ జారి నేరుగా వికెట్లను తాకడంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు క్వాలిఫయర్–1లో జరిగిన మ్యాచ్‌లోనూ ఆర్సీబీపై ఇదే తరహాలో ఔటయ్యాడు. దీంతో ఐపీఎల్‌లో వరుసగా 2 ఇన్నింగ్స్‌ల్లో హిట్ వికెట్‌గా వెనుదిరిగిన తొలి బ్యాటర్‌గా కోరుకుని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు సాయి సుదర్శన్. మ్యాచ్ అనంతరం తాను ఔటైన తీరుపై సాయి సుదర్శన్‌కు ఓ ప్రశ్నకు అతడు సరదాగా స్పందించాడు. 'ఇకపై బ్యాట్ చేతికి అతుక్కుని ఉండేలా గ్రిప్ టెక్నిక్‌లు ఏవైనా ఉన్నాయేమో ప్రయత్నించాలి' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన సాయి సుదర్శన్.. తొలి వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధికం. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మైక్ హస్సీ, మురళీ విజయ్ 159 పరుగులు జోడించగా.. ఆ రికార్డును వీరు అధిగమించారు. అంతేకాకుండా గిల్–సుదర్శన్ జోడీ మరో ఘనతనూ సొంతం చేసుకుంది. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధికంగా 100కు పైగా భాగస్వామ్యాలు నెలకొల్పిన జోడీగా అవతరించింది. వీరిరువురూ 11 సెంచరీ భాగస్వామ్యాలతో.. క్రిస్ గేల్–కోహ్లీ, బాబర్ ఆజమ్–మహ్మద్ రిజ్వాన్, డివిలియర్స్–కోహ్లీ జోడీలను వెనక్కి నెట్టారు. క మ్యాచ్ విషయానికొస్తే.. 215 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గిల్(53 బంతుల్లో 104) అద్భుత శతకంతో మెరిశాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులతో చెలరేగాడు. వీరి దూకుడుకు రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. జీటీ చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్ఆర్ 20 ఓవర్లలో 214/6 పరుగులు చేసింది. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 47 బంతుల్లో 96 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆకట్టుకోగా.. రవీంద్ర జడేజా 45 పరుగులతో రాణించాడు.

మనసులో మాట

# వారణాసి స్టిల్స్ లీక్.. జక్కన్న మౌనం

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు.







# అజిత్ కుమార్‌కు మాతృవియోగం

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడు అజిత్ కుమార్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి మోహిని మణి శనివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోసంబంధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. 84 ఏళ్ల మోహిని మణి మరణవార్త తెలిసిన వెంటనే తమిళ సినీ వర్గాలు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో అజిత్ కుమార్‌తో పాటు అనూప్ కుమార్, అనిల్ కుమార్ కూడా ఉన్నారు. కుటుంబ సభ్యులతో ఎంతో ఆప్యాయంగా ఉండే మోహిని మణి మరణం వారి కుటుంబానికి తీరని లోటుగా మారింది. 2023లో అజిత్ తండ్రి పి.ఎస్. మణి అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. తల్లి మరణవార్త అందుకున్న వెంటనే విదేశాల్లో ఉన్న అజిత్ కుమార్ అత్యవసరంగా చెన్నైకి బయలుదేరినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాచంకం

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# పులి-మేకతో రోజా రీఎంట్రీ


సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణేశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.




# 300 కోట్లు దాటిన కరుప్ప

తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. కరుప్పు చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.



# కరిష్మాకపూర్ తాజా వెబ్ సిరీస్ బ్రౌన్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే ప్రక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746